

తూర్పుపాలెంలో ఐదు పందాలు గెలిచిన మంత్రిపాలెం వాసులకు బుల్లెట్‌ను బహుకరిస్తున్న సినీ నిర్మాత నాగవంశీ,అనగాని శివప్రసాద్

తెలంగాణ నుంచి వచ్చి పందేలు

భోగి మొదలు కనుమ పండుగ రోజయిన బుధవారం వరకు బాపట్ల జిల్లావ్యాప్తంగా వివిధ జూదక్రీడల ద్వారా దాదాపు రూ.60కోట్లు చేతులు మారినట్లు తెలుస్తోంది. దాదాపుగా అందరికీ కనబడేలా ఆయా ప్రాంతాల నడి బొడ్డున సినీ సెట్టింగ్‌లను తలదన్నే రీతితో జిల్లాలో 9 వరకు బరులను ఏర్పాటుచేశారు. ఇందులో ప్రధానంగా పిట్టలవానిపాలెం మండలం మంతెనవారిపాలెం, చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలోని బరులకు సెలబ్రిటీల తో పాటు సామాన్య జనం పోటెత్తారు. తెలంగాణ నుంచి పెద్దఎత్తున పందేల కోసం రాగా దాదాపుగా రూ.35కోట్ల వరకు వారిదే అన్నట్లు సమాచారం. గతంలో వీరిలో ఎక్కువ శాతం పందేల కోసం భీమవరం బాట పట్టేవారు. కానీ ఈ దఫా అదే స్థాయిలో మంతెనవారిపాలెంలో బరిని ఏర్పాటుచేయడంతో ఇక్కడికి పోటెత్తారు.

ఐదు పందేలు కొడితే.. బుల్లెట్

మంతెనవారిపాలెం, తూర్పుపాలెంలోని బరుల నిర్వాహకులు రకరకాల ఆఫర్లతో పందెం రాయుళ్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు. వరుసగా ఐదు పందేలు గెలిస్తే బుల్లెట్‌ను బహుమతిగా ప్రకటించారు. రెండు బరుల్లో కలిపి ముగ్గురి వరకు ఈ కానుకను గెలుచుకున్నట్లు తెలుస్తోంది. వరుసగా ఐదుసార్లు పందెం గెలవడంతో మంత్రిపాలేనికి చెందిన ప్రతాప్‌కు బుల్లెట్‌ను చిత్రనిర్మాత సూర్యదేవరనాగవంశీ, అనగాని శివప్రసాద్‌లు అందజేశారు.

రాత్రింబవళ్లు సందడే సందడి..

కొల్లూరు: కొల్లూరు మండలంలోని క్రాప అడ్డరోడ్డు, అనంతవరం గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన కోడి బరుల వద్ద నాలుగు రోజులుగా కోలాహల వాతావరణం నెలకొంది. బరుల వద్ద గుండాట, నెంబర్ల ఆట, కోతముక్క, తదితరాలను అందుబాటులోకి తేవడంతో ఆ ప్రాంతం జూదరులతో సందడి సందడిగా మారింది. రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకు కోడి పందేలు జరగ్గా జూద క్రీడల మాట సరేసరి. ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు కోడి పందాలు జరిగాయి. కోతముక్క, పేకాట మాత్రం రాత్రింబవళ్ళు సాగినట్లు సమాచారం. గురువారం కూడా కోడి పందేలు సాగుతాయని నిర్వాహకులు మైకుల ద్వారా ప్రచారం చేయడం గమనార్హం.



కోఢి రూ. కోట్లు

- ఆపేదెవరన్నట్లుగా పందేలు
- రాత్రి వేళలో ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లోనూ..
- అధికారం అండతో రెచ్చిపోయిన నేతలు
- వరసగా ఐదు పందేలు గెలిచిన వారికి బుల్లెట్
- పోలీసుల ప్రేక్షకపాత్ర.. చేతులు మారిన నగదు

(బాపట్ల, అద్దంకి, బల్లికురవ, తెనాలి - ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి సంప్రదాయాల ముసుగులో బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కోడిపందేలను యథేచ్ఛగా నిర్వహించారు. కత్తి కట్టిన కోళ్ల కాలు దువ్వగా రూ.లక్షలు చేతపట్టి సుదూర ప్రాంతాల నుంచి వేలాదిగా జూదరులు తరలివచ్చారు. కోడిపందాలు, పేకాట, కోతముక్కాట, నెంబర్లాట అడ్డుఅదుపు లేకుండా కొనసాగాయి. మూడు రోజులమీద కోడిపందాలు, కోతముక్కాట మీద సుమారు రూ.200 కోట్లు బెట్టింగ్‌లు జరిగి ఉంటాయని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. వీఐపీ బరిలో లక్ష నుంచి రూ.5 లక్షల పందేలు జరిగాయి. అధికార పార్టీ నేతల అండ.. కన్నెత్తి చూడని పోలీసులు.. బరి తెగించిన నిర్వాహకులతో కోట్లలో నగదు చేతులు మారాయి. బరుల వద్ద కోతముక్క, నెంబర్లాటలను నిరాటంకంగా నిర్వాహకులు జరిపించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం కనుమ పండుగ సందర్భంగా బుధవారం విచ్చలవిడిగా కోడిపందాలు జోరుగా సాగాయి. భోగి పండుగ ముందు రోజు అరెస్టులు.. బరుల తొలగింపులతో హడావుడి చేసిన పోలీసులు ఆ తర్వాత పత్తాలేకుండా పోయారు. ఫ్లెక్సీలు కట్టి.. మైకు ప్రచారాలతో పందేలపై నిర్వాహకులు హోరెత్తించినా మూడు రోజులు పోలీసులు ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారు. నేరుగా ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీ నేతలే బరుల వద్ద ఉంటూ పందేలను పర్యవేక్షించారు. ఎక్కడయినా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించిన పోలీసు అధికారులకు తీర ప్రాంత గ్రామాలతో పాటు, గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని పలు పల్లెల నడిబొడ్డున ఏర్పాటు చేసిన బరులు మాత్రం కనిపించక పోవడం విశేషం. బరులకు సమీపంలో జూదరుల వాహనాలను క్రమబద్ధీకరించడానికి పోలీసులు పరిమితమయ్యారు. ఇక బరుల వద్ద వీవీఐపీ, వీఐపీ గ్యాలరీలతో పాటు సామాన్య జనం పందేలను వీక్షించడానికి నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బరిలోకి ప్రవేశించాలంటే ట్యాగ్‌లు, టోకెన్లు అందజేసి మరీ పందేలను నిర్వహించారు. బరుల వద్ద జూదరుల కోసం నగదుకు ఇబ్బంది పడకుండా ప్రత్యేకంగా ఏటీఎం తరహా ఏర్పాట్లు కూడా చేశారు. నేతల అండతో దర్జాగా బరులు ఏర్పాటు చేసిన నిర్వాహకులు బరుల వద్దకు ప్రవేశించే విషయంలో బౌన్సర్లతో భద్రతను కట్టుదిట్టం చేసి ఈ దఫా అత్యంత పకడ్బందీగా జూద క్రీడలను నిర్వహించారు. లక్ష రూపాయల చొప్పున పందేలు నడిచాయి. అడిగేదెవరు.. ఆపేదెవరు అన్నరీతిలో లక్షలు దండుకున్నారు. కొన్ని బరుల వద్ద రాత్రి వేళల్లో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేసి పందేలు నిర్వహించారు. ప్రభుత్వం మారినా గతంలో కన్నా హంగు, ఆర్భాటాలు పెంచి మరీ జూదశిబిరాలు దిగ్విజయంగా నిర్వహించారు. పేకాట కూడా స్థాయిని బట్టి లక్ష నుంచి ఐదు లక్షల వరకు నడిచినట్లు సమాచారం. బరుల వద్ద కార్ల పార్కింగ్‌కు రూ.200, బైక్ పార్కింగ్‌కు వంద ఇలా అందిన కాడికి దోచేశారు. బరుల వద్దే పుష్కలంగా మందుతో పాటు మాంస పదార్థాలను కూడా అందుబాటులో ఉంచారు. మొత్తంమీద జూదరులకు బరుల వద్ద ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. మండల స్థాయి కూటమి నేతలు కొందరు పందేలను లాభసాటి వ్యాపారంగా మార్చుకున్నారని పార్టీలోని వక్తులే బహిరంగంగానే విమర్శిస్తున్నారు. బరుల వద్దే మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి అన్ని బ్రాండ్లతో పాటు, బీర్లు లభించును అని బోర్డులను ఏర్పాటు చేసిన నిర్వాహకులు యథేచ్ఛగా మద్యం అమ్మకాలు చేశారు. బ్రాండ్‌ను బట్టి క్వార్టర్ బాటిల్‌కు రూ.100 నుంచి రూ.150 వరకు, ఫుల్ బాటిల్‌కు రూ.300కుపైనే అధికంగా వసూలు చేశారు. అయినా ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి కూడా చూడలేదు.

తీరంలో జోరుగా..

బాపట్ల జిల్లా పరిధిలోని తీర ప్రాంత గ్రామాల్లో 8 బరులతో కోడిపందాలు జోరుగా నిర్వహించారు. చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో యథేచ్ఛగా కోడి పందేలు జరిగాయి. తెలంగాణ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, జిల్లాల నుంచి వేలాది సంఖ్యలో జూదరులు తరలిరావడంతో తూర్పుపాలెం బరులు కిటకిటలాడాయి. సంక్రాంతి పండుగ రోజున మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, సానా సతీష్, మాజీ ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, సినీనిర్మాత సూర్యదేవరనాగవంశీ తదితరులు పందేలను వీక్షించారు. బరుల సమీపంలో కోతముక్క, పేకాటకు ప్రత్యేక గుడారాలను వేసి హైటెక్ క్లబ్ తరహాలో ఏర్పాటు చేశారు.

దుస్తులు, స్వీట్లు పంపిణీ

నగరం మండలం ఏలేటిపాలెం సపోటతోటల్లో వైసీపీకి చెందిన ఓ వ్యక్తి పేకాట, కోతముక్క, యథేచ్ఛగా రెండునెలలుగా కొనసాగిస్తున్నాడు. అయితే సంక్రాంతిని పురస్కరించుకుని దుస్తులు, కేజీ స్వీటు బాక్సులను జూదరులకు పంపిణీ చేసి ఉత్సాహపరిచారు. కనుమపండుగ రోజున నాటుకోడి, చిల్లిగారె, మటన్ ధమ్‌బిర్యాని అందజేశారని సమాచారం.

బరితెగింపు..

అద్దంకి ప్రాంతంలో గతంలో గుట్టుచప్పుడుగా సాగిన కోడి పందేలు.. ఈ ఏడాది బరితెగించి నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. బల్లికురవ, సంతమాగులూరు మండలాల పరిధిలో నాలుగు రోజులుగా కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. బల్లికురవ మండలం మల్లాయపాలెం, సంతమాగులూరు మండలం చవిటిపాలెం వద్ద పందేలు బహిరంగంగానే జరిగాయి. ఈ పందేల్లో సుమారు రూ.50 లక్షలకు పైగానే చేతులు మారినట్లు అంచనా. అద్దంకి, చిలకలూరిపేట, నరసరావుపేట నియోజకవర్గాల నుంచి జూదరులు కోళ్లతో బరుల వద్దకు వస్తున్నా పోలీసులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిచ్చింది. బుధవారం స్థానికులు ఎస్పీ కార్యాలయానికి సమాచారం ఇవ్వగా చివర్లో పోలీసులు వచ్చి హడావుడి చేశారు. పోలీసుల రాకను ముందే తెలుసుకున్న జూదరులు, ప్రేక్షకులు సమీపంలో ఉన్న కొండ పైకి, ఇతర ప్రాంతాలకు పారిపోయారు.




రేపల్లె: తూర్పుపాలెంలో జోరుగా నెంబర్లాట



కొల్లూరు: క్రాప అడ్డరోడ్డు వద్ద కోడి పందెం బరిలో ఉన్న పందెం రాయుళ్ళు



కొల్లూరు: బరివద్ద సాగుతున్న జూద క్రీడలు



అద్దంకి: మల్లాయపాలెం వద్ద కోడి పందెం వద్ద గుమిగూడిన పందెంరాయుళ్ళు, ప్రజలు



కొల్లిపరలో కోడి పందేలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్



చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో జోరుగా కోడిపందేలు

7

మద్యం అమ్మకాల్లో.. సంక్రాంతి జోష్

- 2 రోజులుగా రూ.16.61కోట్ల విక్రయం

నడికుడిలో దొంగల బీభత్సం

- సీసీ కెమెరాలు పగులగొట్టి ఇంట్లో చోరీ
- లక్షల విలువైన బంగారం, నగదు అపహరణ

అనుమానాస్పద స్థితిలో బావ, బావమరిది మృతి

- కల్తీ మద్యమే కారణమా?

సంబరాలు.. సందళ్లు



పర్చూరు: అన్నంబొట్లవారిపాలెంలో బండ లాగుతున్న ఒంగోలు జాతి గిత్తలు



పర్చూరు: పోటీలో ఢీ అంటే ఢీ అంటున్న పొట్టేళ్లు

- ఊరూరా వేడుకగా సంక్రాంతి
- పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలతో పండుగ

బాపట్ల, పర్చూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పండుగతో పల్లెలు మురిశాయి. సంక్రాంతి సంబరాలతో ఊరూవాడా సందడి నెలకొంది. ఉద్యోగ, వ్యాపార ఇతర వృత్తులు, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు స్వగ్రామాలకు చేరి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలసి వేడుకలు నిర్వహించుకున్నారు. చిన్నారులు, విద్యార్థులు గాలిపటాలు ఎగరేసి సందడి చేశారు. పలుగ్రామాల్లో సంక్రాంతి సంబరాలను మూడు రోజులపాటు కుటుంబసభ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఆటపాటలు, సంస్కృతిక కార్యక్రమాలతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. సంక్రాంతి, కనుమ సందర్భంగా ఉదయాన్నే ఇళ్లముంగిట రంగవల్లులు వేసి, గొబ్బిళ్లను అమర్చి అందంగా తీర్చిదిద్దారు. కొత్తపంట బియ్యంతో పొంగలి సిద్ధం చేసి నైవేద్యం సమర్పించారు. కనుమనాడు రథం ముగ్గులతో ముంగిళ్లను తీర్చిదిద్దారు. పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలైన మహిళలకు బహుమతులను అందజేశారు. ఎడ్ల పందేలు, క్రికెట్, వాలీబాల్, ముగ్గుల పోటీల్లో యువత, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎక్కడికక్కడ యువత ఆధ్వర్యంలో క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు పెద్దఎత్తున జరిగా యి. మకర సంక్రాంతి సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. దేవతా మూర్తుల ఊరేగింపులు, తెప్పోత్సవాలు ఘనంగా జరిగాయి. గుంటూరు, నరసరావుపేట, బాపట్ల తదితర ప్రాంతాల్లో అయ్యప్పస్వామి దేవాలయాల్లో మకరజ్యోతిని భక్తులు దర్శించు కున్నారు. కనుమ సందర్భంగా రైతులు పశువు లను అలంకరించి ప్రత్యేకంగా పూజలు చేశారు.

- పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెంలోని గొట్టిపాటి హనుమంతురావు మెమోరియల్ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి పొట్టేళ్ల బల ప్రదర్శన హోరాహోరీగా సాగింది. పోటీల్లో బల్లికురవ మండలం పాతమల్లాయపాలెం గ్రామానికి చెందిన వేల్పూరి నాగవల్లి పొట్టేళ్లు సత్తాచాటి ప్రథమ స్థానం పొందాయి. పర్చూరు మండలం వీరన్నపాలెం గ్రామానికి చెందిన పొటేళ్లు ద్వితీయస్థానం పొందాయి.
- అన్నంబొట్లవారిపాలెంలో ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో సీనియర్ విభాగానికి సంబంధించి మంగళవారం రాత్రి జరిగిన జాక్‌పాట్ పోటీల్లో గుంటూరు జిల్లా కుంచనపల్లికి చెందిన గిత్తలు విజేతగా నిలిచాయి. ఆర్ఆర్ మెమోరియల్ పులగం త్రిషజ్ఞ రెడ్డి, పులగం జస్విత‌రెడ్డికి చెందిన ఎడ్ల జత ప్రథమ, కృష్ణాజిల్లా ఘంటసాల గ్రామం మేకపాటి కృష్ణమోహన్ ఎడ్లు ద్వితీయ, నంద్యాల జిల్లా శిరిమెళ్లకి చెందిన కుందూరు రాంభూపాల్‌రెడ్డి ఎడ్లు మూడో స్థానంలో నిలిచాయి. బాపట్ల జిల్లా వేటపాలేనికి చెందిన అత్తోటి శిరీషచౌదరి ఎడ్లు, పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం ఇనిమెట్ల గ్రామానికి చెందిన కటకం లక్ష్మణ్ కుమార్ గిత్తలు నాలుగు, ఐదో స్థానాల్లో నిలిచాయి..



పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం గ్రామంలో తెప్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు



బాపట్ల: ఎడ్ల బలప్రదర్శన పోటీలను వీక్షిస్తున్న ప్రజానీకం



అమరావతి.. ఆనందం

- రాజధాని రైతులకు కౌలు బకాయిల చెల్లింపు
- చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఫొటోలకు పాలాభిషేకం
- ఐదేళ్ల నిరీక్షణ అనంతరం గ్రామాల్లో పండుగ శోభ
- ఆరేడు నెలలుగా రాజధానిలో నిర్మాణ పనులు పరుగులు

తుళ్లూరు, గుంటూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): రాజధాని రైతుల ఇంట.. ఈ సంక్రాంతి సంతోషాల పంటను తీసుకు వచ్చింది. ఒకవైపు ఆరేడు నెలలుగా రాజధానిలో పనులు పరుగులు తీస్తుండగా.. కొన్నేళ్లుగా నిలిచిపోయిన రాజధాని కౌలు బకాయిలను కూటమి ప్రభుత్వం భోగి రోజు విడుదల చేసింది. దీంతో రాజధాని గ్రామాల్లోని ప్రతీ ఇంటా ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. వైసీపీ పాలనలో ఐదేళ్లపాటు నిత్య నరకం అనుభవించి, పండుగలూ, పర్వదినాలకు దూరమైన రైతులు ఈ ఏడాది సంక్రాంతి సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. వైసీపీ పాలకులు, నాటి అధికారపార్టీల నేతల వేధింపులను ఎదుర్కొంటూనే గత ఐదేళ్ల రాజధాని వాసులు పోరుబాటపట్టారు. కిందటేడాది సంక్రాంతి సందర్భంగా మందడంలో టీడీపీ- జనసేన కూటమి 'భోగి సంకల్పం' కార్యక్రమాన్ని నిర్వహించి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు అమరావతిపై వైసీపీ ప్రభుత్వం తెచ్చిన చీకటి జీవోలను మంటల్లో కాల్చేశారు. అదే వేదికగా మరో 87 రోజుల్లో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అమరావతి నుంచి ప్రజా పరిపాలన ప్రారంభమవుతుందని, బంగారంలాంటి రాజధానిని నిర్మిస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారం చేపట్టిన మరుక్షణం నుంచి రాజధాని నిర్మాణపనులను పరుగులు పెట్టించారు. ప్రమాణ స్వీకారానికి ముందే రాజధాని గ్రామాల్లోని 25వేల ఎకరాల్లో రూ.36.5కోట్లు ఖర్చు చేసి జంగిల్ క్లియరెన్స్ చేశారు. ఐదేళ్ల క్రితం ఆగిపోయిన ప్రభుత్వ భవనాల నిర్మాణం సహా పలు పనుల నిమిత్తం తాజాగా రూ.24 వేల కోట్ల పనులకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. మరో 11,467 కోట్లకు పనులకు ప్రభుత్వం బుధవారం పరిపాలనా ఆమోదం తెలిపింది. దీంతో అమరావతి నిర్మాణం పరుగులు పెట్టనున్నాయి. ఇప్పటికే రాజధానిలో కీలకమైన సచివాలయ భవన సముదాయ నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.4,890 కోట్లు కేటాయించింది. పునాదుల్లో చేరిన నీటిని భారీ మోటార్లతో తోడుతున్నారు. ఈ నెలాఖరులోపు ఆ పనులు కూడా ప్రారంభమవబోతున్నాయి.

కౌలు చెల్లింపులతో పండుగే.. పండుగ

రాజధాని రైతులకు గత ప్రభుత్వం పెట్టిన కౌలు బకాయిలను కూడా కూటమి ప్రభుత్వం చెల్లించింది. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు రెండేళ్లపాటు కౌలు నిలిపివేయడంతో ఆ బకాయిలే రూ.525 కోట్లకు పైగా ఉంది. అందులో తొమ్మిదో ఏడాది కౌలు బకాయిలను కూటమి ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లో చెల్లించింది. కాగా అసైన్డ్ రైతులకు సీఐడీ కేసుల కారణంగా బకాయిలు పెండింగులో పడిపోయాయి. ఈ ఆరునెలల్లో వారి కేసులను పరిష్కరించి, వారికి కూడా రాష్ట్ర ప్రభుత్వం కౌలు చెల్లించింది. సాధారణరైతులు 24 వేల మంది రైతులకు ఇచ్చే పదో ఏడాది కౌలుతో పాటు, 3,123 మంది అసైన్డ్ రైతులకు మూడేళ్ల కౌలు బకాయిలను చెల్లించింది. దీంతో తుళ్లూరు, రాయపూడిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు రాజధానివాసులు పాలాభిషేకం చేశారు. బాణాసంచా కాల్చారు. స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. కౌలు బకాయిల విడుదలతో దళిత, ముస్లిం మైనార్టీ కుటుంబాలు నిజమైన పండుగ జరుపుకుంటున్నామని దళిత బహుజన జేఏసీ అధ్యక్షుడు చిలకా బసవయ్య తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పురపాలక శాఖ మంత్రి నారాయణ, సీఆర్డీఏ కమిషనర్ భాస్కర్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌లకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



తుళ్లూరులో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రైతులు మహిళలు



వార్షిక కౌలు ఇవ్వటంతో స్వీట్లు పంచుకుంటున్న రైతులు



పండగవేళ... సరికొత్త లుక్కులు

సంక్రాంతి సందర్భంగా స్టార్ హీరోల నుంచి చిన్న హీరోలు నటిస్తున్న సినిమాల వరకు కొత్త పోస్టర్స్ విడుదలయ్యాయి. ఈ ప్రచార చిత్రాలతో ప్రేక్షకులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు మేకర్స్.

'రాజాసాబ్' నుంచి ప్రభాస్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. శర్వానంద్ కథానాయకుడిగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'నారీ నారీ నడుమ మురారీ' టైటిల్‌ను ప్రకటించారు. విశ్వక్‌సేన్ నటిస్తున్న 'లైలా'లో ఫీమేల్ లుక్‌ను రివీల్ చేశారు. బ్రహ్మానందం, రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'బ్రహ్మ ఆనందం' నుంచి కొత్త స్టిల్‌ను విడుదల చేశారు. కిరణ్ అబ్బవరం, రుక్సర్ ధిల్లాన్ జంటగా తెరకెక్కుతున్న 'దిల్‌రూబా' వచ్చే నెల 14న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిస్తున్న సినిమా 'సంతాన ప్రాప్తిరస్తు' నుంచి కొత్త పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు.





తారల సంక్రాంతి సంబరాలు

తారలు సంక్రాంతిని ఘనంగా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను సోషల్‌మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి ట్రెడిషనల్ లుక్‌లో కనువిందు చేశారు. రామ్‌చరణ్ తన సతీమణి ఉపాసన, కూతురు క్లీంకారతో కలసి ఫొటో దిగారు. అల్లు అర్జున్ తన సతీమణి స్నేహా రెడ్డి, కూతురు అర్హ, తనయుడు అయాన్‌తో కలసి పిక్ తీసుకున్నారు. మోహన్‌బాబు దంపతులు, తనయుడు విష్ణు ఫ్యామిలీతో తిరుపతిలో కలసి ఫొటోలు దిగారు. వరుణ్‌తేజ్ తన సతీమణి లావణ్యతో కలసి గాలిపటాలు ఎగరేస్తూ ఫొటోలకు ఫోజిచ్చారు. నూతన దంపతులు నాగచైతన్య, శోభితా ధూళిపాళతో సంప్రదాయ దుస్తుల్లో పిక్ తీసుకున్నారు. ఇటీవలే వివాహ బంధంలోకి అడుగుపెట్టిన కీర్తి సురేశ్, ఆంటోని తట్టిల్ జంటగా పండగ వేడుకల్లో తీసుకున్న ఫొటోలను షేర్ చేశారు. అలాగే విఘ్నేష్ నయనతార దంపతులు పిల్లలతో కలసి దిగిన పండగ ఫొటోను షేర్ చేశారు.















నా కెరీర్‌లో మరో బిగ్ బ్లాక్ బస్టర్



వెంకటేశ్

'మా సినిమాను ఇంతగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు, అభిమానులకు ధన్యవాదాలు. మేం మంచి ఫ్యామిలీ సినిమా ఇవ్వాలనే ఆలోచనతో సంక్రాంతికి వస్తున్నాం అని చెప్పాం. నా కెరీర్‌లో మరో బిగ్ బ్లాక్ బస్టర్ ఇచ్చిన దర్శకుడు అనిల్‌కు థాంక్స్' అని అన్నారు విక్టరీ వెంకటేశ్. ఆయన నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' విడుదలై విజయం సాధించిన నేపథ్యంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. దర్శకుడు అనిల్ మాట్లాడుతూ 'సాధారణంగా బెనిఫిట్ షోలకు ఫ్యాన్స్, యూత్ వెళుతుంటారు. కానీ తొలిసారి ఉదయం నాలుగున్నర షోకి ఫ్యామిలీ ఆడియన్స్ రావడం చాలా ఆనందం కలిగించింది' అన్నారు. సినిమాను హిట్ చేసిన ప్రేక్షకులకు నిర్మాత దిల్ రాజు ధన్యవాదాలు తెలిపారు. పైరసీని ఎంకరేజ్ చేయకుండా థియేటర్లలోనే సినిమా చూడాలని ఆయన కోరారు.

అందమైన ప్రేమకథ





'బేబీ' కలయిక మరోసారి రిపీట్ అవుతోంది. ఆ సినిమాతో సూపర్ హిట్ కొట్టిన ఆనంద్ దేవరకొండ, వైష్ణవిచైతన్య జంటగా మరో చిత్రం తెరకెక్కనుంది. '90స్' వెబ్ సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్న ఆదిత్య హసన్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ మేరకు 'యాన్ అన్‌ఫినిష్డ్ స్టోరీ' పేరుతో ఓ అనౌన్స్‌మెంట్ వీడియో విడుదల చేశారు. 'మీరు చూసిన మిడిల్ క్లాస్ ఫ్యామిలీ డ్రామా '90స్'లోంచి పుట్టిన అందమైన ప్రేమకథ ఇది. అన్ని వర్గాలను ఆకట్టుకునేలా చిత్రం తెరకెక్కనుంది" అని పేర్కొన్నారు. త్వరలోనే మరిన్ని వివరాలు ప్రకటించనున్నారు. ఈ సినిమాకు ఎడిటర్: నవీన్ నూలి, సినిమాటోగ్రాఫర్: అజీమ్ మహమ్మద్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్.

ఆస్కార్ వేడుక రద్దు అవుతుందా?



అమెరికాలోని లాస్‌ఏంజిల్స్ ప్రాంతాన్ని కార్చిచ్చు చుట్టుముట్టి, ఎంతో ఆస్తి నష్టం, ప్రాణ నష్టం కలిగించిన ఫలితం ఇప్పుడు ఆస్కార్ అవార్డుల వేడుకలపై కూడా ప్రభావం చూపుతోందా?. టామ్ హాంక్స్, ఎమ్మా స్టోన్, మెల్ గిబ్సన్, స్టీవెన్ స్పీల్‌బర్గ్ వంటి హాలీవుడ్ ప్రముఖులు ఈ అగ్ని ప్రమాదంతో ఇళ్లు కోల్పోయారు. అలాగే ఆస్కార్ కమిటీలోని నలుగురు సభ్యులు కూడా ఈ కార్చిచ్చు వల్ల ఇళ్లు కోల్పోవడంతో మార్చి రెండున జరగాల్సిన ఆస్కార్ వేడుక రద్దు కావచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. అదే నిజమైతే.. 96 ఏళ్ల ఆస్కార్ చరిత్రలో అవార్డుల వేడుక రద్దు కావడం ఇదే తొలిసారి అవుతుంది. కరోనా వంటి క్లిష్ట సమయంలో కూడా ఆస్కార్ కమిటీ వేడుకని వాయిదా వేసింది తప్ప రద్దు చేయలేదు. ఇప్పుడు కూడా అలాగే చేయవచ్చని కొంతమంది అంటున్నారు. కనీ వినీ ఎరుగని రీతిలో ఇలా కార్చిచ్చు వ్యాపించి లాస్ ఏంజిల్స్‌ను బూడిద కుప్పగా మార్చడంతో ఈ నెల 23న జరగాల్సిన నామినేషన్స్ ప్రకటన వాయిదా వేశారు. పరిస్థితిని గమనిస్తున్న ఆస్కార్ కమిటీ అవార్డుల వేడుక జరిగే తేదీలో ఏదన్నా మార్పు ఉంటే త్వరలో ప్రకటిస్తుందని అంటున్నారు.





స్వామియే శరణం అయ్యప్ప

- వైభవంగా సంపత్‌నగర్ అయ్యప్పస్వామి ఆలయంలో మకర జ్యోతి దర్శనం



మకర జ్యోతిని వెలిగిస్తున్న చైర్మన్ గ్రంధి కాంతారావు దంపతులు, కుటుంబ సభ్యులు

గుంటూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంపత్‌నగర్‌లోని అయ్యప్పస్వామి దేవస్థానంలో మకర సంక్రాంతి పర్వదినాన మకర జ్యోతి దర్శన మహోత్సవం ఈ ఏడాది కూడా క్రేన్ అనుబంధ సంస్థ క్రేన్ రిలీజియస్ ట్రస్ట్, క్రేన్ సంస్థల చైర్మన్ గ్రంధి వెంకటసత్యలక్ష్మీ కాంతారావు, లక్ష్మీ హైమావతి దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా జరిగింది. మంగళవారం సాయంత్రం 5.01 గంటలకు స్వామి వారికి తిరువాభరణాలను సంపత్‌నగర్‌లోని క్రేన్ వక్కపొడి ఫ్యాక్టరీ నుంచి దేవాలయానికి కాంతారావు దంపతులు, వారి పెద్ద అల్లుడు మానేపల్లి దివాకర్, పెద్ద కుమార్తె హిమజ, కుటుంబ సభ్యులు, భక్తులు దేవాలయానికి తీసుకొచ్చారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో శరణు ఘోష నడుమ క్రేన్ గ్రూపు సంస్థల చైర్మన్ గ్రంధి కాంతారావు దంపతులు మకర జ్యోతిని వెలగించారు. అదే సమయంలో ఆకాశంలో స్వామి వారు నక్షత్ర దర్శనం ఇవ్వటంతో భక్తులు స్వామియే శరణం అయ్యప్ప అంటూ శరణు ఘోషతో పులకరించిపోయారు. ఈ సందర్భంగా జీవీఎస్ఎల్ కాంతారావు మాట్లాడుతూ గత 49 ఏళ్లుగా సంపత్‌నగర్ అయ్యప్ప స్వామి దేవాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, జిల్లా నలుమూలల నుంచి లక్షలాది మంది స్వామి భక్తులు, దీక్షా స్వాములు ఆలయాన్ని ప్రతి ఏటా సందర్శిస్తారన్నారు. మంగళవారం జరిగిన మకర జ్యోతి దర్శన మహోత్సవం గుంటూరు చరిత్రలో మరువరానిదన్నారు. ప్రతి ఏటా డిసెంబరు, జనవరి మాసాల్లో కాకుండా ప్రతి రోజూ నిత్యం అయ్యప్పస్వామికి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో క్రేన్ గ్రూప్ సంస్థల సిబ్బంది, టంగుటూరి మణి, నగర ప్రముఖులు హాజరయ్యారు. అనేక మంది అయ్యప్పస్వామి భక్తులు ప్రత్యేక వాహనాల్లో సాయంత్రం దేవస్థానం నుంచి శబరిమలకు బయల్దేరారు.

మద్యం అమ్మకాల్లో.. సంక్రాంతి జోష్

- గత 2 రోజులుగా రూ. 16.61 కోట్ల విక్రయం

గుంటూరు కార్పొరేషన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ కు మద్యం అమ్మకాలు మరింత ఊపందుకున్నాయి. వాడవాడలా మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. సొంత ఊర్లకు తరలివచ్చిన ప్రజానీకంతో ఆయా గ్రామాలు, పట్టణాలు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. పండగ మూడు రోజులు భారీ స్థాయిలో ఎక్సైజ్ శాఖకు ఆదాయం చేకూరింది. గతేడాది డిసెంబర్ 31, ఈ ఏడాది జనవరి 1, సంక్రాంతి పండగను పురస్కరించుకొని 12వ తేదీ నుంచి గత 4 రోజులుగా మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. గుంటూరు, పల్నాడు జిల్లాలలో మద్యం అమ్మకాలు వరదలై పారాయి. దీంతో ఎక్సైజ్ ఖజానాకు కోట్లలో ఆదాయం చేకూరింది. లంక ప్రాంతాల్లో, కరకట్ట మొదలుకొని చివరి వరకు పెద్ద ఎత్తున కోడి పందేలు, పేకాట బంకినీలు నిర్వహించారు. వేలాదిమంది సందర్శకులు పేకాట ప్రాంతాలకు, కోడి పందేల నిర్వహణ ప్రాంతాలకు వచ్చారు. అక్కడ పెద్ద ఎత్తున స్నేహితులతో కలిసి ఖుషి ఖుషీగా మద్యం తాగారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ ఏడాది న్యూ ఇయర్‌లో మద్యం అమ్మకాలు రూ. 9.93 కోట్ల అమ్మకాలు జరగ్గా, సంక్రాంతి సందర్భంగా మూడు రోజుల పాటు రూ.16.61మద్యం అమ్మకాలు జరిగాయి. గుంటూరు, పల్నాడు జిల్లాలలో పెద్ద ఎత్తున కోడి పందేలు జరిగాయి.

తెనాలిలో టెన్షన్.. టెన్షన్

- రజక చెరువు కూడలిలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు
- అనుమతి లేదన్న మున్సిపల్ అధికారులు
- తొలగించాలంటూ మరికొందరు
- మంత్రి మనోహర్ చొరవతో సద్దుమణిగిన వివాదం



అంబేడ్కర్ విగ్రహం, తొలగిస్తారన్న ఆలోచనతో అక్కడకు చేరిన ఐతానగర్ వాసులు

తెనాలి(మారీస్‌పేట), జనవరి 15, (ఆంధ్రజ్యోతి): రాత్రికి రాత్రే అంబేడ్కర్ విగ్రహాన్ని ఓ సామాజిక వర్గం ఏర్పాటు చేస్తే, అనుమతి లేకుండా ఏర్పాటు చేశారని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నందున వెంటనే తొలగించాలంటూ మరో సామాజిక వర్గం పట్టుబట్టింది. అటు మున్సిపల్ అధికారులు కూడా అనుమతి లేకుండా ఏర్పాటు చేశారంటూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెనాలి టు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటం, విగ్రహం తొలగించకుండా కాపాడుకునేందుకు తరలి రావాలంటూ చలో తెనాలికి మరికొందరు పిలుపునివ్వటంతో తెనాలిలో టెన్షన్ వాతావరణం ఏర్పడింది. తహసీల్దార్ మండల మెజిస్ట్రేట్ హోదాలో శాంతిభద్రతలకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే దీనిపై మంత్రి మనోహర్ జోక్యం చేసుకోవటంతో టెన్షన్ వాతావరణం సర్దుమణిగింది. తెనాలి రజక చెరువు కూడలిలో గతంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు ఒక పెద్దపాటి దిమ్మెను నిర్మించారు. అయితే అప్పటి నుంచి అక్కడ విగ్రహం మాత్రం పెట్టలేదు. తాజాగా విగ్రహం ఏర్పాటుకు నిర్మాణ కమిటీ సన్నాహాలు చేయటంతో అధికారులు అనుమతి లేకుండా పెట్టవద్దని వారికి ముదుగానే సూచించారు. అయితే తమ దగ్గర అన్ని అనుమతులూ ఉన్నాయంటూ కమిటీ సభ్యులు, మరికొందరు అంబేడ్కర్ అభిమానులు సోమవారం అర్ధరాత్రి హడావుడిగా విగ్రహాన్ని క్రేన్ సాయంతో ఏర్పాటు చేశారు. మంగళవారం మున్సిపల్ అధికారులు విగ్రహాన్ని తొలగించాలని కోరటం, కమిషనర్ శేషన్న వారితో సంప్రదింపులు జరిపినా వారు దానికి అంగీకరించలేదు. తెనాలి పట్టణంలోకి వచ్చే ప్రధాన రహదారి అదే కావటం, రద్దీ ఎక్కువగా ఉండే రోడ్డు కావటంతో ఎక్కువ విస్తీర్ణంలో కట్టిన దిమ్మెను తొలగించి విగ్రహం ఏర్పాటు చేసేందుకు కావాల్సినంత దిమ్మెను నిర్మించుకోవాలని, లేదంటే పూర్తిగా దిమ్మెను తొలగించేస్తే, మేమే మరోచోట విగ్రహ నిర్మాణం చేయించుతామనే హామీలిచ్చినా వారు మాత్రం తొలగించటానికి వీలులేదని భీష్మించారు. అయితే అక్కడే ఉన్న మరో సామాజికవర్గం ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా తొలగించాలని కోరటంతో మరింత వేడెక్కింది. ఇరువర్గాలు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి విన్నవించారు. అయితే విగ్రహం తొలగించటం మా అభిమతం కాదనీ, అంబేడ్కర్ విగ్రహం తొలగింపు విషయంలో వస్తున్న ప్రచారాన్ని నమ్మాల్సిన పనిలేదనీ, ఎవరూ ఆందోళన పడాల్సిన పనిలేదని తేల్చిచెప్పటంతో వారంతా శాంతించారు. అయితే విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులంతా డీఎస్పీ జనార్ధనరావు, తహసీల్దార్ గోపాలకృష్ణ, కమిషనర్ శేషన్న, ఇతర అధికారుల సమక్షంలో సమావేశమై మాకు నమ్మకం కలిగిందనీ, ఎటువంటి ఆందోళన ఉండదని పేర్కొన్నారు. శాశ్వత విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని, రజక చెరువులో కొంత విస్తీర్ణాన్ని అంబేడ్కర్ లైబ్రరీ, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేటాయించాలని కోరారు. ఇదిలా ఉంటే అంబేడ్కర్ విగ్రహాన్ని కాపాడుకునేందుకు అందరూ తెనాలి తరలిరావాలంటూ చలో తెనాలికి పిలుపునివ్వటం చర్చనీయాంశమైంది. అధికార పార్టీ నాయకుడు, న్యాయవాది హరిదాసు గౌరీశంకర్, మరికొందరు నాయకులు కూడా తాము విగ్రహ ఏర్పాటుకు వ్యతిరేకం కాదని, దీనిని కావాలనే కొందరు బయటి వ్యక్తులు ప్రవేశించి గొడవలు సృష్టించేందుకు కుట్ర చేశారని, ఆ కుట్రను నిర్మాణ కమిటీ నమ్మకుండా ఎటువంటి అలజడులు లేకుండా తెనాలిలో శాంతియుత వాతావరణానికి సహకరించటం గొప్ప విషయమని పేర్కొన్నారు.

పుకార్లను నమ్మవద్దు

అంబేడ్కర్ విగ్రహాన్ని మున్సిపల్ అధికారులు తొలగిస్తారంటూ వస్తున్న పుకార్లలో ఏమాత్రం వాస్తవం లేదనీ, కేవలం ప్రజల్లో అలజడిరేపేందుకు కొందరు చేస్తున్న ప్రచారం మాత్రమేనని పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న అన్నారు. బుధవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయలో మున్సిపల్ శేషన్న, తహసీల్దార్ గోపాలకృష్ణ, డీఎస్పీ జనార్ధనరావులతో కలసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని అయినా ప్రజల్లో ఆ విగ్రహం తొలగిస్తారనే అపోహలు నెలకొనడంతో విగ్రహ నిర్మాణ సభ్యులు ఆందోళనలు చేపట్టారని చెప్పారు. విగ్రహంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడానికి కమిటీ సభ్యులతో చర్చించామని, వారు కూడా సానుకూలంగా స్పందించి విగ్రహం తొలగింపు లేదనే విషయంపై స్పష్టత పొందారని చెప్పారు.

ప్రైవేటు ట్రావెల్స్ చార్జీల బాదుడు

గుంటూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి కొన్ని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు చార్జీల దోపిడీకి తెరతీశాయి. టిక్కెట్ల కృత్రిమ కొరతను సృష్టించి రోజుకో రేటుతో బాదుడు ప్రారంభించాయి. మూడు రోజుల ముచ్చటైన పండగకు సొంతూళ్లకు వచ్చిన ప్రయాణికులు తిరిగి గమ్యస్థానాలకు చేరుకునేందుకు సిద్ధమయ్యారు. ఉద్యోగ, విద్యా, వ్యాపార ఇతర కార్యకలాపాలతో హైదరాబాద్, చెన్నై, బెంగళూరుతో పాటు ఇతర దూర ప్రాంతాల్లో స్థిర పడిన వారు పండుగకు జిల్లాకు చేరుకున్నారు. మూడు రోజుల పండగ ముగిసిన నేపథ్యంలో తిరుగుపయనం కోసం ఎవరికి వారు ఆర్టీసీ, రైల్వేతో పాటు ప్రైవేటు ట్రావెల్స్ యాజామాన్యాలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే రైల్వేతోపాటు ఆర్టీసీ కూడా అదనపు సర్వీసులను ఏర్పాటు చేసింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రైల్వేలో టిక్కెట్‌లు దొరకకపోవటం, ఆర్టీసీలో కూడా అంతంతమాత్రంగా ఉండటంతో కొందరు ప్రయాణికులు ప్రైవేటు ట్రావెల్స్‌లో తిరుగు ప్రయాణం చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ఆర్టీసీ ఈ దఫా పండగకు స్పెషల్ సర్వీసులకు కూడా సాధారణ చార్జీలనే వసూలు చేస్తున్నారు. ఆర్టీసీలో గుంటూరు నుంచి కేపీహెచ్‌బీకి సాధారణ నాన్ ఏసీకి రూ. 540, ఇంద్ర ఏసీకి రూ. 870 కాగా అమరావతి ఏసీకి రూ. 700 వసూలు చేస్తున్నారు. ఇక గుంటూరు నుంచి చెన్నైకి సూపర్ లగ్జరీ నాన్ ఏసీ సర్వీసుకు రూ. 760, కాగా గుంటూరు నుంచి బెంగళూరుకు నాన్ ఏసీ సూపర్ లగ్జరీకి రూ. 1150, అమరావతి ఏసీకి 1850, ఇంద్ర ఏసీకి రూ. 1460 చార్జీ వసూలు చేస్తున్నారు. పండగ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని కొన్ని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు టిక్కెట్ చార్జీల దోపిడీ చేస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుంటూరు నుంచి హైదరాబాద్‌కు సాధారణ నాన్ ఏసీ అయితే రూ. 700ల నుంచి పైనే వసూలు చేస్తున్నారు. ఏసీ సర్వీసు అయితే రూ. వెయ్యి పైనే వసూలు చేస్తున్నారు. ఇక బెర్త్ అటువంటివి అయితే రూ. 2వేలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గుంటూరు నుంచి చెన్నైకు కూడా రూ. వెయ్యిపైనే చార్జీలు వసూలు చేస్తున్నారు. బెంగళూరుకు కూడా రూ. 3వేల వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డిమాండ్‌ను బట్టి రోజుకో రేటు

పండగ ముగిసిన రోజు బుధవారం రాత్రి టిక్కెట్ చార్జీల ధర ఒకలా ఉంటే మరుసటి రోజు గురువారం రాత్రి చార్జీల ధర మరోలా ఉంటుంది. కనుమ రోజే తిరుగు ప్రయాణమయ్యేందుకు అత్యవసరమైన వారు తప్ప అత్యధికశాతం మంది పెద్దగా ఆసక్తి చూపటం లేదు. గురువారం రాత్రి నుంచి తిరుగు ప్రయాణమయ్యేందుకు అత్యధిక శాతం మంది సిద్ధమవుతున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న కొన్ని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు ముందుగానే టిక్కెట్‌లు బుక్ అయిపోయినట్లు కృత్రిమ కొరతను సృష్టించి టిక్కెట్ చార్జీలను అమాంతం పెంచేసి ప్రజల నుంచి చార్జీల దోపిడీ చేస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఆర్టీఏ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి సామాన్య ప్రయాణికులకు టిక్కెట్ చార్జీలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలి.

నడికుడిలో దొంగల బీభత్సం

- సీసీ కెమెరాలు పగులగొట్టి ఇంట్లో చోరీ
- లక్షల విలువైన బంగారం, నగదు అపహరణ

దాచేపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలు జరిగిన సంఘటన బుధవారం దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నడికుడిలో సాయిబాబా గుడి సమీపంలో రెండిళ్లలో, మరోచోట మెయిన్‌బజారులో ఉన్న మరో మూడిళ్లలో, పొందుగల గ్రామ పంచాయతీ శివారు శ్రీని వాసపురంలో రెండు ఇళ్లల్లో చోరీలు జరిగాయి. బాధితులంతా పండుగకు ఊరెళ్లారు. తాళాలు వేసిన ఇంటిని లక్ష్యంగా చేసుకొని చోరీలు జరిగాయి. నడికూడి గ్రామంలోని సాయిబాబా గుడి వద్ద కేళావత్ బాలాజీనాయక్ ముగ్గుమిల్లు వ్యాపారి. కుటుంబసభ్యులతో కలిసి మాచర్ల సమీ పంలోని కొత్తపుల్లారెడ్డిగూడెం వెళ్లారు. అతని ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాలను పగులగొట్టి ఇంటి లోపల వున్న సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌ను కూడా దొంగలు తీసుకెళ్లారు. ఇంట్లోని విలువైన బంగారం, నగదు, ఇతర విలువైన వస్తువులను తీసుకెళ్లారు. బాలాజీనాయక్ ఇంటికి వేసిన తాళాలను పగులగొట్టి దొంగలు తమదగ్గర వున్న తాళాలు ఆ ఇంటికి వేశారు. బాలాజీనాయక్ ఇంటిపక్కన ఉన్న షేక్ రహీం కుటుంబసభ్యులు కూడా హైదరాబాద్ వెళ్లారు. ఆ ఇంట్లో బీరువా పగులగొట్టి వెండి వస్తువులు, విలువైన సామాన్లు చోరీకి గురైనట్లు బాధితులు వివరించారు. నడికూడిలోని మెయిన్ సెంటర్‌లో ఉన్న సయ్యద్ పెద్దసైదా, రైల్వే ఉద్యోగి అప్పారావు ఇళ్లల్లో కూడా చోరీ జరిగింది. శ్రీనివాసపురం గ్రామంలో హరిదాసు రామకృష్ణ, యేపూరి నరసమ్మ ఇంటికి తాళాలు వేసి వుండగా తాళాలు పగులగొట్టి చోరీ చేసినట్లు స్థానికులు పేర్కొన్నారు. శ్రీనివాసపురంలో మరో ఒకటి, రెండు ఇళ్లల్లో చోరీకి ప్రయత్నం చేయగా ఆ ఇంట్లో వున్న వ్యక్తులు లైట్లు వేసి ఎవరు అంటూ పెద్దగా కేకలు వేయడంతో దొంగలు పరారయ్యారు.

అనుమానాస్పద స్థితిలో బావ, బావమరిది మృతి

- కల్తీ మద్యమే కారణమా?

అచ్చంపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన అచ్చంపేట పంచాయతీ పరిధిలోని చామ్రరు బీసీ కాలనీలో మంగళవారం రాత్రి పెనువిషాదం సంభవించింది. చామ్రరుకి చెందిన గౌతుకట్ల కోటయ్య అనారోగ్యంతో మృతి చెందగా, మంగళవారం కోటయ్య అంత్యక్రియలు జరిగాయి. దహన సంస్కారాల అనంతరం కోటయ్య పెద్దకుమారుడు గౌతు కట్ల నాగేశ్వరరావు(45), అతని బావమరిది తెల్లమేకల నాగేశ్వరరావు(36) వాంతులు, విరోచనాలు అయ్యాయి. ఒకరి తర్వాత మరొకరు గంటల వ్యవధిలోనే మంగళవారం రాత్రి మృతి చెందారు. దహనసంస్కారాల సమయంలో వీరిద్దరూ మద్యం తాగినట్లు తెలిసింది. కల్తీ మద్యం కారణంగా మృతి చెంది ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. మృతుడు గౌతుకట్ల నాగేశ్వరరావుకు భార్య వెంకాయమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. తెల్లమేకల నాగేశ్వరరావు ఎన్‌టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం రామన్నపేటకి చెందిన వాడు. ఇతనికి భార్య పద్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చామ్రరులో పెద్దల సమక్షంలో శవపంచనామా నిర్వహించినట్లు వీఆర్‌వో బాలూనాయక్ తెలిపారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటప్రసాదు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి విలేఖరి ఆత్మహత్య

గుంటూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రమౌళినగర్‌లో షైహోమ్స్ అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి కోలుకొండ శ్రీకర్(55) ఆత్మహత్య చేసుకున్నాడు. తురకపాలెం గ్రామ పరిధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న శ్రీకర్ ఓ దినపత్రికలో రిపోర్టర్‌గా పని చేస్తున్నారు. గతంలో ఆయన తమ్ముడు ఇదే విధంగా ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇటీవల ఆయన తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. దీనికితోడు ఆర్థిక ఇబ్బందులు కూడా ఉన్నాయి. దీంతో శ్రీకర్ తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయ్యాడు. బుధవారం ఉదయం తన తండ్రి అస్థికలు కృష్ణానదిలో కలుపుతానని చెప్పి ఉదయం 9.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వచ్చాడు. అయితే మధ్యాహ్నం సమయంలో బృందావన్ గార్డెన్స్ నుంచి ఐటీసీ హోటల్‌కు వెళ్లే దారిలోని షై హోమ్స్ అపార్ట్‌మెంట్ పై అంతస్తుకు వెళ్లి అక్కడ నుంచి కిందకు దూకేశాడు. కిందపడిన శ్రీకర్ అక్కడిక్కడే మృతి చెందాడు. శ్రీకర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	138,147,158
చికెన్ విత్ స్కిన్	264.00
చికెన్ స్కిన్ లెస్	274.00

హోరాహోరీగా జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు

ఈపూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో రైతుమిత్ర కబడ్డీ కమిటీ ఆధ్వర్యంలో జరగుతున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీలు నాలుగో రోజు బుధవారం రసవత్తరంగా సాగాయి. పోటీల్లో పలు రాష్ట్రాల నుంచి వచ్చిన జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఎస్‌వీఎస్ జట్టుపై హర్యాణా, జార్ఖండ్ జట్టుపై ఇండియా నేవి, సత్తెనపల్లి జట్టుపై ఏపీ స్టైల్, ఆంధ్రాపై కర్ణాటక, రావిపాడుపై ఇండియా నేవి జట్లు విజయం సాధించాయి. తల్లపనేని రామారావు, సూరే కోటేశ్వరరావు పోటీలను పరిశీలించారు.

అర్ధరాత్రి దొంగలు హల్‌చల్

- ఒకే రోజు 8 గృహాల్లో చోరీ
- పండుగపూట దొంగతనాలతో ప్రజలు బెంబేలు

గురజాలటౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పండుగపూట.. ఒకే రోజు వరుస దొంగతనాలతో దుండగులు హడలెత్తించారు.. తాళాలు వేసి ఉన్న గృహాలను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడ్డారు. సంక్రాంతి పండుగ రోజైన మంగళవారం అర్ధరాత్రి దొంగలు గురజాల పట్టణంలో 2, మండలంలోని పులిపాడులో 6 గృహాల్లో చోరీలకు పాల్పడ్డారు. పండుగకు తమ గ్రామాలకు, పట్టణాలకు వెళ్లిన వారి గృహాలను లక్ష్యంగా చేసుకొని ఆయా గృహాల్లో చోరీలకు పాల్పడ్డారు. గృహాల్లోని బీరువాలను పగులకొట్టి భారీగా నగదు, వెండి అపహరించారు. గృహాల్లోని సీసీ కెమెరాలను సైతం దుండగులు ధ్వంసం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు చోరీకి గురైన గృహాల వద్దకు చేరుకొని క్లూస్‌టీం సహాయంతో వివరాలు సేకరించారు. చోరీకి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. పండుగపూట వరుస దొంగతనాలతో మండల ప్రజలు బెంబెలెత్తిపోతున్నారు.

సబ్ డివిజన్ పరిధిలో 15 గృహాల్లో చోరీ : డీఎస్పీ జగదీష్



గురజాల సబ్‌డివిజన్ పరిధిలో మంగళవారం రాత్రి 15 గృహాల్లో చోరీ జరిగినట్లు డీఎస్పీ జగదీష్ తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళవారం రాత్రి దాచేపల్లి, గురజాల పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాల్లో వరుస దొంగతనాలు జరిగాయన్నారు. సుమారు 15 గృహాల్లో దుండగులు చోరీ చేశారన్నారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సిబ్బంది పలు బృందాలుగా ఏర్పాటు చేసి విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. సంక్రాంతి పండుగకు ఊర్లకు వెళ్లిన వారి గృహాల్లో చోరీలు జరిగాయన్నారు. ప్రజలు పోలీస్ లాక్ మానిటరింగ్ సిస్టంను వినియోగించుకోవాలని, దీని ద్వారా గృహాల్లో లేని సమయంలో పోలీసు నిఘా ఏర్పాటు ఆస్తులను రక్షిస్తామని, దొంగతనాలను అరికడతామని డీఎస్పీ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

పెదకాకాని, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండల పరిధిలోని తక్కెళ్ళపాడు గ్రామం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు బుధవారం పెదకాకాని పోలీసులు తెలిపారు. తక్కెళ్ళపాడు పంపు హౌస్ రోడ్డులోని కొమ్మూరి శ్రీనివాసరావు పశువుల చావడి వద్ద గల చెట్టుకు గుర్తుతెలియని సుమారు 65 సంవత్సరాల వ్యక్తి ఉరి వేసుకుని వేలడుతూ ఉండగా, అక్కడ వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసిన వారు పెదకాకాని సీఐ 8688831350, ఎస్సై 8688831352 సమాచారం ఇవ్వాల్సిందిగా పోలీసులు కోరారు.

యువకుల ఘర్షణ

పొన్నూరుటౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కోడిపందేల విషయంలో చెలరేగిన వివాదం యువకుల మధ్య ఘర్షణకు దారి తీసింది. పొన్నూరు మండలం వెల్లలూరు గ్రామ శివారు బాపట్ల జిల్లా, చుండూరు సమీపంలో సంక్రాంతి సందర్భంగా కోడిపందేల బరి ఏర్పాటు చేశారు. అక్కడ జరిగిన కొద్దిపాటి ఘర్షణ నేపథ్యంలో గుంటూరుకు చెందిన యువకులు స్థానిక యువకులతో ఘర్షణకు దిగారు. ఘర్షణ అనంతరం యువకులు అక్కడ నుంచి వెళ్లిపోయే క్రమంలో పొన్నూరు మండలం బ్రహ్మణకోడూరు అడ్డరోడ్డు వద్దకు చేరుకున్నారు. అక్కడ మళ్లీ ఘర్షణకు దిగారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ క్రమంలో గుంటూరు యువకులు కారులో పరారైయ్యారు. స్థానికులు బుడంపాడు వరకు వెంబడించారు. కాగా యువకుల ఘర్షణపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు. ఈ దాడిలో గుంటూరుకు చెందిన యువకుల కారు అద్దాలు పూర్తిగా ధ్వంసం అయినట్లు సమాచారం.

రేపటి నుంచి ఎన్టీఆర్ కళా పరిషత్ నాటకోత్సవాలు

గుంటూరు (తూర్పు), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం, అన్నమయ్య కళావేదికపై కె.ఆర్.కె. ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కళాపరిషత్ నిర్వహణలో 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు కాట్రగడ్డ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 17న నిశ్శబ్దమా నీ ఖరీదెంత, ఇంద్రప్రస్థ, 18న వర్క్ ఫ్రమ్ హోం, 19న చిగురు మేఘం, 20న జేబు చెప్పిన ఊసులు సాంఘిక నాటిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. అంతేగాక వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసార్, సినీ నిర్మాతలు కాట్రగడ్డ ప్రసాదు, అట్లూరి నారాయణరావులను ఎన్టీఆర్ ఆత్మీయ పురస్కారాలతో సత్కరిస్తామని అన్నారు. కార్యక్రమాలకు ముఖ్యఅతిథిలుగా ఘంటా పున్నారావు, మహమద్ రఫీ, భాష్యం రామకృష్ణ, వీపీ శంకరరావు, అంబటి మధు మోహనకృష్ణ, తిలక్‌బాబు, కల్చరల్ కమిషన్ చైర్‌పర్సన్ తేజస్విని హాజరౌతున్నట్లు తెలిపారు. కార్యక్ర మాలు ప్రతి రోజూ సాయంత్రం 6.15 గంటలకు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 563.00 అడుగులు ఉంది. ఇది 239.42 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9833 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6791, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 19,304 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 37.72 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కులు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

24న చేనేత కార్మికుల ధర్నాను జయప్రదం చేయాలి

భట్టిప్రోలు, (కొల్లూరు), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల ధర్నాను జయప్రదం చేయాలని సంఘ జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ పిలుపునిచ్చారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 24వ తేదీన చీరాలలో జౌళిశాఖ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధర్నా కరపత్రాన్ని స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బి.సత్యనారాయణ, సభ్యులు బట్టు నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపాలెంలో తెప్పోత్సవం

పిట్టలవానిపాలెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాజీపాలెంలో సంక్రాంతి పండుగ సందర్భంగా శ్రీరామాలయంలో నిర్వహించిన ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకొని స్థానిక చెరువు వద్ద విద్యుత్‌కాంతులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెప్పోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

రజిత సర్వాంగ అలంకారంలో రామేశ్వర స్వామి


విశేషాలంకరణలో జంపని రామేశ్వర స్వామి

వేమూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంపని గ్రామంలో ఉన్న శ్రీ రామేశ్వరాలయంలో కనుమ పండుగను పురస్కరించుకుని వార్షిక పూజాకర్తలు స్వామికి ప్రత్యేక పూజలు జరిపించారు. అర్చకులు ఏకాదశి రుద్రాభిషేకం చేసి అన్నాభిషేకం చేశారు. అనంతరం వెండి సర్వాంగంతో స్వామిని అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు స్వామికి దీప హారతులు సమర్పించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

పిట్టలవానిపాలెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : తన చెల్లుకుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చొని వెళుతుండగా ఆర్టీసి బస్సు ఢీకొని ఓ మహిళ మృతి చెందిన ఘటన ఇది. చందోలు ఎస్‌ఐ ఆర్ స్వామి శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం నిజాంపట్నం నుంచి బయలుదేరి చీరాల వెళుతుండగా మార్గం మధ్యలో పిట్టలవానిపాలెం మండలం అలకాపురం గ్రామం దాటిన తర్వాత మెయిన్‌రోడ్డుపై అదేగ్రామంలో నిజాంపట్నం నుంచి పొన్నూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో మోపిదేవి వెంకటేశ్వరమ్మ(45)కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయంపై స్వామి శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

కొల్లూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో పురుగు మందును శీతల పానీయంగా భావించి తాగిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ ఏడుకొండల తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలపరిధిలోని దోనేపూడి శివారు గ్రామం కోటిపల్లికి చెందిన కేసర శ్రీనివాసరావు (60) సోమవారం మద్యం మత్తులో ఉన్న వృద్ధుడు పరిస్థితి ఆందోళనకరంగా ఉండగటంతో గమనించిన కుటుంబ సభ్యులు ఆరా తీయగా కూల్‌డ్రింక్ అనుకొని పురుగుమందు తాగినట్లు గుర్తించారు. వెంటనే వృద్ధుడిని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జూదరుల అరెస్టు

పిట్టలవానిపాలెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పిట్టలవానిపాలెం గ్రామపంచాయతీలోని పంటపొలాల్లో కోడిపందేలు ఆడుతుండగా చందోలు ఎస్‌ఐ ఆర్ స్వామి శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి బుధవారం దాడులు నిర్వహించారు. కోడిపందెపురాయుళ్ళ నుంచి నాలుగు కోడిపుంజులు, రూ.2500 నగదును స్వాధీనం చేసుకొని ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు ఢీ కొని ఒకరికి గాయాలు

కొల్లూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : కారు ఢీ కొని ద్విచక్ర వాహన దారుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. బుధవారం మండల పరిధిలోని క్రాప గ్రామానికి చెందిన తలశిల రమేష్ తన ద్విచక్ర వాహనంపై వస్తూ అడ్డరోడ్డు వద్ద నుంచి ప్రధాన రహదారిపై వస్తుండగా తెనాలి వైపు నుంచి అతి వేగంగా కొల్లూరు వైపుకు వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని 108వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

స్ఫూర్తి ప్రదాత కత్తి పద్మారావు

● గాయకుడు జయరాజు

పొన్నూరు టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కవిత్వానికి, జీవన తత్వానికి స్ఫూర్తి ప్రదాత డాక్టర్ కత్తి పద్మారావు అని గాయకుడు జయరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని కత్తి పద్మారావు గృహానికి గాయకుడు జయరాజ్, మంగతాయారు దంపతులు వచ్చారు. ఈ సందర్భంగా జయరాజు అనేక పాటలు పాడి వినిపించారు. వారిని కత్తి పద్మారావు దంపతులు సత్కరించారు.

కోలాహలంగా రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన

● ప్రారంభించిన మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్
● విజేతగా నిలిచిన పందిళ్ళపల్లి ఎడ్లజత


ఎడ్ల బలప్రదర్శన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అన్నం సతీష్ ప్రభాకర్

బాపట్ల, జనవరి 15(ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణంలోని భీమావారిపాలెం శ్రీకోదండరామాలయం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్లబలప్రదర్శన కోలాహలంగా జరిగింది. 15 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఈ పోటీలను మాజీ ఎమ్మెల్సీ బీజేపీ నాయకులు అన్నం సతీష్ ప్రభాకర్ లాంఛనంగా ప్రారంభించారు. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా ప్రతి ఏడాది ఈ పోటీలు నిర్వహించటం సంతోషకరమన్నారు. పోటాపోటీగా జరిగిన ఈ ప్రదర్శనలో 1.5 క్వింటాళ్ళ విభాగం నందు పందిళ్ళపల్లికి చెందిన పాలపర్తి మూగయ్య ఎడ్లజత విజేతగా నిలిచింది. వీరికి రామిడి సత్యనారాయణ జ్ఞాపకార్థం రామిడి రవిచంద్ర రూ.30వేల నగదు బహుమతిని అందజేశారు. అదేవిధంగా పోతురాజు కొత్తపాలెంకు చెందిన మరుప్రోలు చెన్నకేశవరెడ్డి ఎడ్లజత ద్వితీయ స్థానంలో గెలుపొందింది. వీరికి గోపాళం కోటేశ్వరరావు జ్ఞాపకార్థంగా గోపాళం రెడ్డియ్య 25వేల బహుమతిని అందజేశారు. ముత్తాయపాలెంకు చెందిన అంగిరేకుల మోహన వెంకటమణికంఠయాదవ్ ఎడ్లజత తృతీయ స్థానంలో గెలుపొందగా అన్నం రవీంద్రకుమార్ రూ.20వేల నగదు బహుమతిని, వేటపాలెంకు చెందిన బల్లిపల్లి కోటేశ్వరరావు, ఈపూరుపాలెంకు చెందిన అనుష్‌కుమార్ యాదవ్‌ల ఎడ్లజత నాలుగో స్థానంలో గెలుపొందగా వీరికి కారుమూరి శ్రీనివాసరావు, కారుమూరి అంజనేష్‌లు రూ.15వేల నగదు బహుమతిని అందజేశారు. వేటపాలెంకు చెందిన దేవరపల్లి సాయిభార్గవరెడ్డి, బల్లిపల్లి కోటేశ్వరరావు ఎడ్లజతలు ఐదో స్థానంలో గెలుపొందగా వీరికి రౌతు శ్రీనివాసబాబు రూ.10వేల నగదు బహుమతిని అందజేశారు. పురుషాపట్టణంకు చెందిన షేక్ బడే ఆరో స్థానంలో గెలుపొందగా నరహరి నాగమల్లేశ్వరరావు రూ.7,500ల నగదు బహుమతిని అందజేశారు. అదే విధంగా 100కేజీల విభాగంలో కాకుమాను మండలం గార్లపాడుకు చెందిన రామినేని శ్రీనివాసరావు ఎడ్లజత ప్రథమస్థానంలో, మోపిదేవి మండలం కుక్కిలిగడ్డ కొత్తపాలెంకు చెందిన తుంగల నాగసింధు ఎడ్లజత ద్వితీయ స్థానంలో, విశ్వనాధపల్లి గ్రామానికి చెందిన పల్లిశెట్టి ఉమామహేశ్వరరావు ఎడ్లజత తృతీయ స్థానంలో, చినగంజాం మండలం సోపిరాల గ్రామానికి చెందిన ముంగర విజయలక్ష్మీ ఎడ్లజత నాలుగో స్థానంలో, మరుప్రోలువారిపాలెం గ్రామానికి చెందిన ఆసోది శివానందల సాయిరెడ్డి ఎడ్లజత 5వ స్థానంలో గెలుపొందింది. వీరందరికి నగదు బహుమతులు పంపిణి చేశారు. పోటీలలో పాల్గొన్న ప్రతి ఎడ్లజత కు బాపట్ల కాపు సేవాసంఘం ఆధ్వర్యంలో ఇత్తడిబిందె, బక్కెట్ అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, డిఎస్పీ రామాంజనేయుల చేతులమీదగా బహుమతులు పంపిణి చేశారు. కార్యక్ర మంలో నిర్వాహకులు లేళ్ళ నరేంద్ర, రౌతురామాంజనేయులు, రౌతు శ్రీనివాసరావు, ఆళ్ళ శ్రీనివాసరావు, ధూళిపాళ్ళ శ్రీనివాసరావు, ఈమని నగేష్, జిడుగు శ్రీనివాసరావు, కారుమూరి అంజనేష్, భీమా నరసింహారావు, కారుమూరి శ్రీనివాసరావు, భీమా శంకరరావు, కాపు సేవాసంఘం అధ్యక్షులు ఇక్కుర్తి శ్రీనివాసరావు, ఇనుపగోళ్ళ రంగారావు, కొటికలపూడి సురేష్, భీమా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఓపెన్ షటిల్ బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు


ఓపెన్ షటిల్ బ్యాట్మింటెన్ పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న బాపట్ల మాజీ ఎమ్మెల్యే మంతెన అనంతవర్మ, కళాశాల సిబ్బంది తదితరులు

పిట్టలవానిపాలెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మంతెన వెంకటరాజు మెమోరియల్ ఓపెన్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను మాజీ ఎమ్మెల్యే మంతెన అనంతవర్మ ఆయన సోదరులు మంతెన శ్రీనివాసవర్మలు సంయుక్తంగా నిర్వహించారు. మండలంలోని ఖాజీపాలెం కేవీ ఆర్‌కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల క్రీడాప్రాంగణంలో మూడుజిల్లాలైన బాపట్ల, పల్నాడు, గుంటూరు స్థాయిల్లో నిర్వహించిన ఈ పోటీల్లో 48 టీమ్‌లు పాల్గొనగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు నాటౌట్ పద్ధతిలో 4టీమ్‌లుగా విభజించి ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన క్రీడాకారులకు ప్రథమ బహుమతి చిలకలూరిపేటకు చెందిన నవీన్, హిమబిందు టీమ్ 10వేలు, బాపట్లకు చెందిన ద్వితీయ బహుమతి గోకుల్, జితేంద్ర టీమ్‌లు రూ.8వేలు, తృతీయ బహుమతి రేపల్లెకు చెందిన మునీర్, హేమంత్ టీమ్‌లు 6వేలు, నాలుగో బహుమతిని పొన్నూరుకు చెందిన రామ్మోహన్, కొరివ టీమ్‌లు 4 వేలు రూపాయలు కైవశం చేసుకున్నారు. ఈ బహుమతులను అనం తవర్మ ఆయన సోదరుడు శ్రీనివాసవర్మలు విజేతలకు అందజేశారు. కళాశాల పాలకవర్గం అధ్యక్షుడు డాక్టర్ మంతెన నరసరాజు, అనంతవర్మలు బ్యాడ్మింటన్ ఆటను ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశా ల ఉపాధ్యక్షుడు మంతెన వెంకటశివరామరాజు, బ్లుపాల్ కంప్యూటర్స్ అధినేత మంతెన శ్రీనివాసవర్మ, కళాశాల జాయింట్ సెక్రటరి మంతెన కృష్ణంరాజు, కళాశాల ప్రిన్సిపాల్ టి.శివప్రసాద్, పలువురు గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర యువజన విధానంతోనే ఉపాధి అవకాశాలు

● ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సుభానీ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సుభానీ, జిల్లా కన్వీనర్ బిజిలిబాబు తదితరులు

బాపట్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సమగ్ర యువజన విధానంతోనే ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సుభానీ పేర్కొన్నారు. ఈనెల 27వ తేదీన జరిగే బాపట్ల జిల్లా ఏఐవైఎఫ్ మహాసభకు సంబంధించిన పోస్టర్లను స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో బుధవారం విడుదల చేశారు. జిల్లా కన్వీనర్ బిజిలిబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుభానీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం నిరుద్యోగం పెంచుతుందన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగులు భర్తీ చేస్తామన్న హామీని అమలు చేయకపోవటంతో దేశంలో నిరుద్యోగం రికార్డు స్థాయిలో పెరిగిపోతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్ని మూసివేసి ప్రైవేటీకరణ ప్రోత్సహిస్తున్నారన్నారు. అఖిలభారత యువజన సమాఖ్య శ్రీకాకుళంలో ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకు 22వ రాష్ట్ర మహాసభలు జరుగుతాయన్నారు. ఆయా సభల్లో ఈ అంశాలపై చర్చిస్తామన్నారు. ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బిజిలిబాబు, ఫణేంద్ర, సతీష్, రాకేష్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పిటిషన్ రద్దు హర్షణీయం : కొల్లా

బాపట్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేసుకు సంబంధించి నారా చంద్రబాబునాయుడు బెయిల్ రద్దు చేయాలని దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టులో కొట్టివేయటం హర్షణీయమని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. అనేక మంది యువతకు శిక్షణ ఇచ్చి నైపుణ్యాలు పెంచి ఉద్యోగావకాశాలు కల్పించిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్‌లో జరగని అవినీతిపై అభూతకల్పనలు చేసి 53 రోజులు జైల్లో నిర్బంధించి రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడిందన్నారు. పాపం పండే వైసీపీ జాతకాన్ని జగన్ రాజకీయ భవిష్యత్తును చావుదెబ్బతీసి ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా 11సీట్లకే పరిమితం చేసి ప్రజలు తీర్పునిచ్చారన్నారు.

విద్యుత్ సర్‌చార్జీల బారాన్ని ప్రభుత్వమే భరించాలి

● సీపీఐ నేత బి.శ్రీనివాసరావు

భట్టిప్రోలు(కొల్లూరు), జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సర్‌చార్జీల భారాన్ని ప్రభుత్వమే బరాయించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చిందన్నారు. ఈ నెలలో విద్యుత్ బిల్లులను పరిశీలిస్తే వినియోగం కంటే అదనపు చార్జీల భారం అధికంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రూప్ అప్ చార్జీలతో పాటు మూడు సంవత్సరాలు ఎఫ్‌పీపీసీ చార్జీలను వసూలు చేస్తూ ప్రజలపై పెను భారం మోపడం అన్యాయమన్నారు. వెంటనే అదనపు చార్జీలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు గొట్టుముక్కల బాలాజీ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయలకు నిలువుటద్దం సంక్రాంతి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు


కేసన శంకరావును సన్మానిస్తున్న బొర్రావారిపాలెం గ్రామస్థులు

రేపల్లె, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంస్కృతీ సంప్రదాయాలకు నిలువుటద్దం సంక్రాంతి పండుగ అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బొర్రావారిపాలెంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీరప్రాంతంలో సంక్రాంతి సంబరాలు చేసుకోవటం ఆనందంగా ఉందన్నారు. అనంతరం గ్రామస్థులు కేసనశంకరరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేకా వెంకటేశ్వరరావు, బొర్రా వెంకటేశ్వరరావు, సర్పంచ్ కేసన నాగముత్యాలమ్మ, కేసన సోమయ్య, ఎంపీటీసీ బొర్రా గుడారంకమ్మ, బొర్రాసురేంద్ర, బి.తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

బాపట్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవి గ్రామపంచాయతీ రామ్‌నగర్ గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా జనసేన నాయకులు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలను జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ ప్రారంభించారు. పోటీల్లో ఆసక్తిగా పాల్గొన్న మహిళల ముగ్గులను పరిశీలించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఆరమళ్ళ సుజిత, సిరిశెట్టి సంజయ్, కొక్కిలిగడ్డ వంశీ, నాగేంద్రబాబు, గోపిరాజు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.


ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

● కమతం సాంబశివరావు, విజయకుమారి


ముగ్గులపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతిని అందిస్తున్న జనసేన నాయకులు కమతం సాంబశివరావు, విజయకుమారి

రేపల్లె, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో ముందుండాలని జనసేనపార్టీ నాయకులు కమతంఫౌండేషన్ ట్రస్టీ కమతం సాంబశివరావు, విజయకుమారి అన్నారు. బుధవారం మండలంలోని చెన్నుపల్లివారిపాలెంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతిని జాహ్నవి, సాయినిహారిక, రెండో బహుమతి సుధా, మమత, పద్మజ,మూడో బహుమతి సుప్రియ, స్వప్న, భవానిలు గెలుపొందారు. వారికి నగ దు బహుమతి అందించారు. కార్యక్రమంలో నాగశ్రీ, సర్పంచ్ ముత్తిరెడ్డి, జయరామయ్య, మాజీ సర్పంచ్ డి.పుల్లారావు, చెన్నుపల్లి సుబ్బారావు, మల్లేశ్వరరావు, నవీన్, హరివెంకటసాయి, మణికంఠ, భావిరెడ్డి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గూడవల్లిలో ముగిసిన సంబరాలు

చెరుకుపల్లి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లి మండలం గూ డవల్లిలోని జీఏఆర్ చౌదరి కల్యాణమండపంలో మూడురోజులుగా గూడవల్లి-నడింపల్లి కమ్మసంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న సంబరాలు బుధవారంతో ముగిశాయి. ఈ సంబరాలకు దేశ, విదేశాల నుంచి కూడా అనేక మంది వచ్చారు. ఈ సంబరాల్లో జూదక్రీడలను కాదని సంప్రదాయ క్రీడలైన చెడుగుడు, షటిల్, వాలీబాల్ లాంటి క్రీడలతో గ్రామయువకులు గ్రామస్థులను అలరించారు. బాలబాలికలు, యువత, సంప్రదాయ నృత్యాలతో ఆహ్లాదపరిచారు. కిష్కిందపాలెంనకు చెందిన వారు చేసిన జడకోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సంబరాల్లో తమవారిని పాతస్నేహితులను ఎంతోకాలం తరువాత కలుసుకోవడం తమకు చాలా ఆనందంగా ఉందని విదేశాల నుంచి వచ్చిన వారు చెప్పారు. ప్రతిసంవత్సరం ఈ సంబరాలకు రావడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు.


సంప్రదాయక్రీడ చెడుగుడు ఆడుతున్న గ్రామయువకులు

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

కొల్లిపర, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా కొల్లిపర శివారు బొమ్మువానిపాలెంలో కోడి పందేలను మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పండుగ సందర్భంగా సరదాగా మాత్రమే జరుపుకోవాలని జూదంగా జరుపుకోవడం మంచి విధానం కాదన్నారు. సంప్రదాయాలను విడనాడకుండా ఉండేందుకు కోసమే కోడి పందేలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. సంప్రదాయాలను అనుసరించే విషయంలో కొన్ని జాగ్రత్తలు కూడా పాటించాలన్నారు. సమాజానికి ఇబ్బంది కలిగే రీతిలో కాకుండా వినోదాత్మకంగా కోడి పందేలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఆలపాటి రాజేంద్రప్రసాద్ సతీమణి మాధవి, టీడీపీ సీనియర్ నాయకుడు ఘట్టమనేని రామకృష్ణ, సర్పంచ్‌లు కొల్లి రజనీశివరామిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, వంగా సాంబిరెడ్డి పాల్గొన్నారు.

రామస్వామి చౌదరి సేవలు చిరస్మరణీయం

● అసోసియేట్ డీన్ ఎం సర్దార్‌బేగ్


కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న అసోసియేట్ డీన్ ఎం సర్దార్‌బేగ్ తదితరులు

బాపట్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదిగా ప్రముఖ హేతువాద రచయిత, సంఘసంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధుడు త్రిపురనేని రామస్వామి చౌదరి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ ఎం సర్దార్‌బేగ్ పేర్కొన్నారు. కళాశాలలో బుధవారం రామస్వామి చౌదరి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సర్దార్‌బేగ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ కులవ్యవస్థ మీద, సామాజిక అన్యాయాల మీద ఆయన పూర్తి స్థాయిలో ఉద్యమం ప్రారంభించారన్నారు. సంస్కృత భాషలో ఉన్న పెళ్ళి మంత్రాలను తెలుగులో అనువదించి అచ్చులో సరళమైన వివాహ విధి అను పద్ధతిని తయారు చేశారన్నారు. అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారన్నారు. అనేక రచనల ద్వారా చైతన్యం తీసుకొచ్చిన ఆదర్శమూర్తి రామస్వామి చౌదరి అని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఫణేంద్రకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగుకీర్తి జాతీయ పురస్కారానికి అడుసుమల్లి


అడుసుమల్లి మల్లికార్జున

బాపట్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : బాపట్లకు చెందిన రచయిత, సాహితీవేత్త, విశ్రాంత ట్రాన్స్‌కో ఉద్యోగి అడుసుమల్లి మల్లికార్జున తెలుగుకీర్తి జాతీయ పురస్కారానికి ఎంపికైనట్లు అంతర్జాతీయ శ్రీకళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ తెలియజేశారు. సాహిత్య రంగంలో చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈపురస్కారం అందజేస్తున్నారు. శ్రీకళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్‌రైటర్స్ ఫామ్, పోయెట్రీ అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన పురస్కారం ఇవ్వనున్నారు. శ్రీకొత పూర్ణా నంద విలాస్ కవితా వేదిక విజయవాడ నందు జరిగే సాహిత్య కార్యక్రమంలో ఈ పురస్కారం అందుకోనున్నారు. పురస్కారం లభించటం సంతోషంగా ఉంద ని అడుసుమల్లి తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, సాహితీ మిత్రులు వీసీ సాయిబాబు, జీవీ, శివాజిగణేషన్, ఏపీ ట్రాన్స్కో విశ్రాంత ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యదర్శి అలపర్తి నారాయణస్వామి తదితరులు అభినందనలు తెలియజేశారు.

అయ్యప్పస్వామి ఆలయంలో మకర జ్యోతి దర్శనం


మకర జ్యోతి దర్శనం


అయ్యప్ప స్వామి ఆలయంలో పడి హారతులు వెలిగిస్తున్న భక్తులు

వేమూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : వేమూరులో ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి వారి ఆలయంలో మంగళవారం సాయంత్రం మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా శబరిమలైలో మకర జ్యోతి దర్శనం సమయంలో అఖండ కర్పూర హారతి వెలిగించారు. ముందుగా మూల విరాట్ స్వరూపాన్ని విశేషంగా అలంకరించి 18మెట్ల పూజ జరిపారు. అనంతరం మకర జ్యోతి దర్శనం చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప దీక్షాపరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. శరణు ఘోషతో ఆలయం మార్మోగింది.

వైభవంగా గోదాదేవి, రంగనాయక స్వామి కల్యాణం


గోదాదేవి రంగనాయక స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

భట్టిప్రోలు, (కొల్లూరు), జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : గోదాదేవి, రంగనాయక స్వామి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళవారం భట్టిప్రోలులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థాన ప్రాంగణంలో ఉన్న జనార్ధన స్వామి వారి ఆలయంలో గోదాదేవి రంగనాయక స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణ కార్యక్రమంలో పోరుమాల మురళీకృష్ణ, హరిణికుమారి, తూనుగుంట్ల వెంకట సుబ్బారావు, సునీత తదితరులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలను పాతూరి కాంతారామశర్మ, సాయిచరణ్‌లు నిర్వహించారు. తొలుత చిన్నారులకు భోగి పళ్ళు పోశారు. బొమ్మల కొలువు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జనార్ధనస్వామి సేవాసమితి ఆర్గనైజర్లు మాటూరి లక్ష్మీసుజాత, కోట సంధ్యారాణి, భవాని, బూర్లె అరుణకుమారిలు పర్యవేక్షించారు.

చింతాయపాలెంలో పూర్వ విద్యార్థుల సందడి


చింతాయపాలెంలో సమావేశమైన 1992-1993 పూర్వ విద్యార్థులు

కర్లపాలెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా 1992-1993వ సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు అందరు కలిసి ఆత్మీయ సమావేశం అయ్యారు. పూర్వవిద్యార్థులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులందరూ కలిసి తమ గురువులను పూజించి పూలమాలలతో ఘనంగా సన్మానించగా గురువులు వారికి ఆశీస్సులు అందజేశారు. తాము చదువు చెప్పిన విద్యార్థులు ఉన్నత స్థానంలో ఎదిగినందుకు ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

బాపట్ల, జనవరి 15(ఆంధ్రజ్యోతి) : మకర సంక్రాంతి సందర్భంగా బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ మాజీ ఉపాధ్యక్షుడు గెల్లి దిలీప్‌కుమార్ పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. దశాబ్దకాలంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. హరిదాసులకు బియ్యం, నగదు, టవల్స్ కూడా పంపిణీ చేశారు. తన తాత గెల్లి అదిశేషు చేపట్టిన సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా వెంకటేశ్వర స్వామి తెప్పోత్సవం

చేబ్రోలు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శేకూరులోని వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి సంగం జాగర్లమూడి వరకు ఉన్న కాలువలో మకర సంక్రాంతి సందర్భంగా స్వామివారికి విశేష పూజలు జరిగాయి. మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత స్వయంభు శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి సంగం జాగర్లమూడి గ్రామ శివారు వరకు ఈ ఉత్సవం జరిగింది.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

» పలుచోట్ల ముగ్గుల పోటీలు
» గ్రామాల్లో స్వామివార్ల తిరువీధి ఉత్సవం

వేటపాలెం(చీరాల), జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సర్వదినాన్ని పురస్కరించుకుని రామన్నపేట శివాలయం వద్ద రామన్నపేట ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి హాజరైన మహిళలు ముగ్గుల పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ తాము వేసే ముగ్గులలో సంక్రాంతి పండుగతో పాటు సమాజ హితాన్ని కోరేలా వారు ముగ్గులు తీర్చిదిద్దారు. గెలుపొందిన వారికి సినీనటుడు, వేటపాలెం ముద్దుబిడ్డ అజయ్‌ఘోష్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళనుకళగా చూస్తే అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. పోటీలో గెలుపొందిన వారికి ఆయన చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

చీరాలటౌన్ : భోగీ, సంక్రాంతి, కనుమ వేడుకలు చీరాల పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. ఈక్రమంలో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ముగ్గులు, వివిధ సాంస్కృతిక పోటీలు సాగాయి. పండుగకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు చేరుకుని యువతీయువకులు, పెద్దలు ఆనందించారు. నూతన వస్త్రాలను ధరించి పండుగను ఆనందించారు. బుధవారం పెద్ద సంఖ్యలో ఉద్యోగ, విద్యాభ్యాసాలు సాగించే ఊళ్లకు తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో బస్టాండ్, రైల్వే స్టేషన్ కిటకిటలాడింది.

హోరాహోరీగా గుండురాయి పోటీలు

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం పంచాయతీ సావరపాలెం పోలేరమ్మ గుడివద్ద


గుండురాయి పోటీల విజేతలు సాంబయ్య, హేమంత్


పోటీలలో ప్రథమ బహుమతి పొందిన ముగ్గు

50 కేజీల గుండురాయిని ఎత్తే పోటీలు ఘనంగా జరిగాయి. ఈ జిల్లాస్థాయి గుండురాయి పోటీలు శ్రీకృష్ణ యాదవ్ యూత్ ఆధ్వర్యంలో 21 సంవత్సరం లోపు వయసు వారికి జరిగాయి. యువకులు ఉత్సాహంగా పోటీపడ్డారు. జెల్లి సాంబయ్య, హేమంత్ రెండు సార్లు పోటీ పడి ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. దీంతో ఇద్దరు ప్రథమ బహుమతికి ఎంపికయ్యారు. గొర్ల గణేష్ మూడవస్థానానికి పరిమితమయ్యాడు. దీంతో నిర్వాహకులు విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

బల్లికురవ : మూడు రోజులుగా గ్రామాలలో సంక్రాంతి పండగ వేడుకలను ప్రజలు సందడితో జరుపుకున్నారు. పట్టణ ప్రాంతాలలో ఉండే బంధుమిత్రులతో కలిసి గ్రామాలకు చేరి పండుగను జరుపుకొన్నారు. మంగళవారం అన్ని గ్రామాలలో దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అలానే పలు చోట్ల మహిళలు, యువకులు పలు రకాల పోటీలలో పాల్గొన్నారు. బుధవారం చిన అంబడిపూడి, కొత్తపాలెం తదితర గ్రామాలలో మోటార్ సైకిల్ స్లో, మరియు ముగ్గుల పోటీలతో పాటు ట్రాక్టర్ రివర్స్ పోటీలను నిర్వహించారు. మండలంలోని కొణిదెన గ్రామంలో యువకులు పాట కచేరీ ఏర్పాటు చేసి ప్రజలను ఉత్సాహ పరిచారు.

పంగులూరు : సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాలలో ముగ్గులు, క్రీడల పోటీలు నిర్వహించారు. మంగళ, బుధ వారాలలో రేణంగివరం, పంగులూరు, నూజెళ్లపల్లి తదితర గ్రామాలలో జరిగిన ముగ్గులు, క్రీడల పోటీలలో మహిళలు, యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. వివిధ ప్రాంతాలలో కొలువులుదీరిన యువత గ్రామాలకు చేరుకుని ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. రేణంగివరంలో టీడీపీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, బాలికలకు కుర్చీలాట, యువతకు కబడ్డీ, ట్రాక్టర్ రేసింగ్ పోటీలు నిర్వహించారు. టీడీపీ నేత బొర్రెడ్డి ఓబుల్‌రెడ్డి వారి మిత్ర బృందం విజేతలకు బహుమతులు అందచేశారు. గ్రామాల్లో స్వామి గ్రామోత్సవాలు వైభవంగా నిర్వహించారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సినీనటుడు అజయ్‌ఘోష్

మేదరమెట్ల : సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలల్లో ఆటల పోటీలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం రావినూతలలో గంగమ్మ గుడి వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలలో పాల్గొన్న మహిళలు అందరికి బహుమతులు అందజేశారు. మహిళలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చినగంజాం : గ్రామాల్లో సంక్రాంతి సంబరాలను వేడుకగా నిర్వహించారు. మకర సంక్రాంతి, కనుమ పండగలను మంగళ, బుధ, వారాల్లో గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో వివిధ రకాల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో కోలహలం నెలకొంది. మున్నంవారిపాలెంలో లక్ష్మణ సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించి ప్రత్యేకంగా అలంకరించిన టైరుబండిపై ఉంచి మున్నంవారిపాలెం, చినగంజాం, మూలగానివారిపాలెం గ్రామ ప్రధాన వీధులలో మంగళవాయిద్యాలు, బాణసంచాలతో ఊరేగింపు నిర్వహించి, తదనంతరం బాలకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని చెరువులో తెప్పోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కడవకుదురు గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కడవకుదురు గ్రామ టీడీపీ, శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో చెడుగుడు, రంగవల్లుల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. సంతరావూరు గ్రామంలో లక్ష్మీచెన్నకేశవస్వామికి గ్రామోత్సవం నిర్వహించి, అనంతరం కొమ్మమూరు కాలువలో తెప్పోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మార్టూరు : నేతాజీనగర్‌లో గుంటూరు రామారావు షాపు సమీపంలో మంగళవారం సంక్రాంతి పండుగ సందర్భంగా యువతీయువకులకు పలు పోటీలు నిర్వహించారు. ముగ్గులపోటీలలో పత్తిపాటి దుర్గమ్మ, నాగండ్ల విజయలక్ష్మి, నాగండ్ల నాగ ప్రవళిక బహుమతులు గెలుచుకున్నారు. కబడ్డీలో మొదటి బహుమతిని బైండ్లయూత్ నేతాజీ నగర్, రెండవ బహుమతిని రామ్‌నగర్ కాలనీయూత్ గెలుచుకుంది. కుండ కొట్టే పోటీలలో మొదటి బహుమతిని గుంటూరు గోపిచంద్, రెండవ బహుమతిని గుంటూరు అమర్నాథ్ గెలుచుకున్నారు.


నాగరాజుపల్లిలో లక్ష్మీనారాయణస్వామి తిరువీధోత్సవం

కనులపండువగా రాములోరి తెప్పోత్సవం

మార్టూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం మండలంలోని రాజుపాలెం, నాగరాజుపల్లి గ్రామాలలో రామోలోరి తెప్పోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. రాజుపాలెం గ్రామంలో కోదండ రామస్వామి దేవస్థానం నుంచి సీతా కోదండరామస్వామి లక్ష్మణ ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన బోటులో చెరువులో తెప్పోత్సవం నిర్వహించారు.అనంతరం అర్చకులు సీతారామాచార్యులు పర్యవేక్షణలో గ్రామోత్సవం చేశారు. అదేవిధంగా నాగరాజుపల్లి గ్రామంలో శ్రీలక్ష్మీనారాయణస్వామి దంపతుల ఉత్సవ విగ్రహాలను చెరువులో తెప్పోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. తరువాత అర్చకులు వెంకట సుబ్బాచార్యులు, శివసాయి కృష్ణ ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రజలు తిలకించారు.

ముగిసిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

మార్టూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలలపూడి గ్రామంలో జిల్లా స్థాయి సీనియర్ బ్యాడ్మింటన్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీలలో ఇంకొల్లుకు చెందిన ప్రఫుల్ అండ్ ఆంజనేయులు టీమ్ మొదటి స్థానాన్ని, రెండవ స్థానాన్ని వలపర్లకు చెందిన జాన్ అండ్ కిషోర్ టీమ్, మూడవ స్థానాన్ని పంగులూరుకు చెందిన కాలేషా అండ్ మణి టీమ్ గెలుచుకున్నారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

సంతమాగులూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంతమాగులూరు మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు ప్రత్యేక సోదాలు నిర్వహించి కోడి పందేలు నిర్వహిస్తున్న ఐదుగురిని, రెండు కోళ్లను ఎస్ఐ పట్టాభి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కోళ్లను, రూ.3600 నగదును స్వాధీనం చేసుకున్నారు.

రెండు మోటార్ సైకిళ్లు ఢీ

నలుగురికి గాయాలు

మేదరమెట్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్లలోని రావినూతల రోడ్డులో రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో నలుగురికి గాయాలయ్యాయి బుధవారం ఉదయం తెనాలికి చెందిన ఎద్దు రవీంద్ర తన అమ్మమ్మ ఊరు అయిన రావినూతల వచ్చాడు. తాత అంకయ్యను ఎక్కించుకుని మేదరమెట్ల వెళుతుండగా ఒడిసాకు చెందిన ఇద్దరు వ్యక్తులు రావినూతల వైపు వెళ్త రవీంద్ర వాహనాన్ని ఢీకొన్నారు. ఈ సంఘటనలో 4లుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫీ సంఘటన్‌పై స్థానికులను విచారిస్తున్నారు.

విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీ

మార్టూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలలపూడి జడ్పీ హైస్కూల్‌లో 10వతరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు శ్రీదేవి అక్షర సమితి చైర్మన్ ఈవీ నారాయణ ఉపకారవేతనాలను అందచేశారు. మంగళవారం కోలలపూడి జడ్పీ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ఉపకారవేతనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.సతీష్ కుమార్, కందిమళ్ల సాంబశివరావు, అంజిబాబు, రామకోటేశ్వరరావు, నాగేశ్వరరావు, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కొండయ్యను సన్మానిస్తున్న పెద్దలు

ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జనవరి 15(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని ఈపురుపాలెం పద్మనాభునిపేటలో బుధవారం రాత్రి భద్రాతి సమేత భావనరుషి స్వామి తిరుణాళ్ల, చీరాల పాపరాజుతోటలోని శ్రీ కృష్ణ గోశాలలో జరిగిన ప్రత్యేక పూజల్లో, తెల్ల గాంధీ బొమ్మ సమీపంలో భద్రావతీ సమేత భావనారుషి స్వామి తిరుణాల్లలో కొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యే కొండయ్యను అర్చకులు స్వాగతం పలికి, ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. గ్రామస్థులు, భక్తులు పలు అంశాలను కొండయ్య దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో కూటమి నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కొలుపు ఉత్సవం


మేళతాళాలతో ఊరేగుతున్న మహాలక్ష్మి అమ్మవారు

పంగులూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని చందలూరు గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి కొలుపు మహోత్సవం భక్తిశ్రద్ధలతో సాగుతోంది. వేద పండితుల పూజా కార్యక్రమాలు, విద్యుత్ దీపాలతో రూపుదిద్దుకున్న ప్రభ ఊరేగింపు, రాత్రి వేళ కోలాట ప్రదర్శనలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, సంగీత కచేరీ కార్యక్రమాలతో సందడి నెలకుంది. సంక్రాంతి పండుగతో పాటు తమ ఇంటి ఇలవేల్పుగా భావించే అమ్మవారి కొలుపు ఉత్సవం సందర్భగా ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయ పనుల నిమిత్తం పొరుగు ప్రాంతాలలో స్థిరపడిన గ్రామస్థులు, బంధు మిత్రులు గ్రామానికి చేరుకోవడంతో వీధులలో జన సందోహంతో సందడి నెలకుంది. గ్రామంలోని ఆలయాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకించారు. బుధవారం సూర్య బలిజ వంశస్తులు అమ్మవారికి మోయనం సమర్పించి, శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవంలో వేలాదిగా భక్తులు పాల్గొని అమ్మవారికి అభిముఖంగా వెనుకకు నడుస్తూ పూలు, తమలపాకులు సమర్పిస్తూ మొక్కులు తీర్చుకున్నారు.

చికెన్, మటన్ దుకాణాల వద్ద బారులు

అద్దంకి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ రోజు కనుమను మాంసం ప్రియులు ఆ నందంగా చేసుకున్నారు. గతంలో వలే పశువులను పూజించటం పూర్తిగా కనుమరుగై కనుమ అంటే మాంసం తినడంగా మారింది. ఈ క్రమంలో బుధవారం అద్దంకి పట్టణంలో చికెన్, మటన్, ఫిష్ దుకాణాల వద్ద కొనుగోలుదారులు బారులు తీరారు. వందల సంఖ్యలో కొనుగోలుదారులు చేరడంతో నామ్ రోడ్డుపై ట్రాఫిక్‌కు కూడా అంతరాయం ఏర్పడే పరిస్థితి నెలకొంది. ప్రధానంగా పోతురాజుగండి వద్ద నుంచి భవానీసెంటర్, శింగరకొండ రోడ్డులో మసీదు సమీపం వరకు బుధవారం ఉదయం మాంసం ప్రియులతో కిటకిటలాడింది. మటన్ దుకాణాలు కూడా గతం కంటే మూడింతలు ఎక్కువగా ఏర్పాటు చేశారు. సంక్రాంతికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చి సరదా కుటుంబసభ్యులతో గడిపే క్రమంలో బుధవారం పట్టణంలో ఉన్న నాలుగు సినిమా హాళ్లు కూడా కిక్కిరిసి పోయాయి.


భవానీ సెంటర్‌లో చికెన్ దుకాణాల వద్ద బారులు తీరిన ప్రజలు

ఎన్టీఆర్ నా జీవితంలో అంతర్భాగం

» మైనార్టీ వ్యవహారాల సలహాదారు మహ్మద్ షరీఫ్
» అనంతవరంలో ఎన్టీఆర్ కళాపరిషత్ నాటిక పోటీలు ప్రారంభం

యద్దనపూడి, (మార్టూరు) జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ నా జీవితంలో అంతర్భాగమని ఆ మహానుభావునితో రాజకీయంగా కలిసి పనిచేయడం నా అదృష్టం.. పైసా ఖర్చు చేయకుండా టీడీపీ నాకు పెద్ద పదవులు ఇచ్చిందని అదీ ఆ పార్టీ గొప్పతనమని రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారులు జనాబ్ మహమ్మద్ షరీఫ్ గుర్తుకు తెచ్చుకున్నారు. యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో బుధవారం రాత్రి ఎన్టీఆర్ కళాపరిషత్ తృతీయ ఉభయ తెలుగురాష్ట్రాల నాటిక పోటీలను జనాబ్ మహమ్మద్ షరీఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు కళాపరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు అధ్యక్షత వహించారు. అతిథులుగా జేఏసీ కన్వీనర్ పువ్వాడ సుధాకర్, మారెళ్ల వంశీ పాల్గొన్నారు. ఈ సభలో షరీఫ్‌ను కళాపరిషత్ సభ్యులు ఆధ్వర్యంలో మారెళ్లవంశీ శాలువా కప్పి సత్కరించారు. అమరావతి మహిళా రైతులు, పువ్వాడ సుధాకర్, కందిమళ్ల సాంబశివరావుతో పాటు పలువురు గ్రామస్థులు షరీఫ్‌ను సత్కరించారు. తరువాత షరీఫ్


షరీఫ్‌ను సత్కరిస్తున్న సభలో అమరావతి జేఏసీ కన్వీనర్ సుధాకర్, అమరావతి మహిళా రైతులు

మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా తెలుగుజాతి గౌరవాన్ని,ఔన్నత్యాన్ని,ప్రతిష్టను చాటి చెప్పిన వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు.

ఆకట్టుకున్న నాటికలు

ఎన్టీఆర్ కళాపరిషత్ నాటికపోటీలలో తొలుత విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారిచే స్వేచ్ఛ నాటికను ప్రదర్శించారు. వ్యక్తుల జీవితాలలో వారి జీవనవిధానాలలో స్వేచ్ఛ అనేది నిర్ణయాత్మక నియంత్రణ, సంరక్షణతో కూడుకున్న స్వచ్ఛతగా ఉండాలని, మితిమీరిన స్వేచ్ఛ తెగిన గాలిపటం లాంటిదనే సందేశంతో ప్రదర్శించిన స్వేచ్ఛ నాటిక ప్రేక్షకులను ఆకట్టుకున్నది. తరువాత న్యూస్టార్ మోడరన్ థియేటర్ ఆర్ట్స్ విజయవాడ వారు ప్రదర్శించిన ఐ ఏట్ ఇండియా నాటిక ప్రేక్షకులను ఆలోచింపచేసింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడుదశాబ్దాలు అయినా పేదవారు పేదగానే ఉన్నారని, రాజకీయనాయకులు మాత్రమే ధనవంతులుగా ఎదిగారనే, కడుపుమండిన పేదవారు ఆలోచనాధోరణిని ఇతివృత్తంగా నాటికను ప్రదర్శించారు. చివరగా శ్రీసద్గురు కళాసమితి గుంటూరు వారు కమనీయం నాటికను ప్రదర్శించారు. కళాకారుడు తన వారసత్వాన్ని మరో కళాకారునికి అందిస్తున్నట్లే, కళా హృదయులు కూడా తమ కళాభిమానాన్ని భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో నాటిక ప్రదర్శన సాగింది. కళారూపాలు ప్రదర్శించే చోటికే ప్రేక్షకులు రావాలనే సందేశంతో నాటిక ముగుస్తుంది. గురువారం నాటిక ప్రదర్శ కొనసాగనుంది.


స్వేచ్ఛ నాటికలోని సన్నివేశం


కమనీయం నాటికలోని సన్నివేశం

టీడీపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

అద్దంకి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మాయపాలెంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొత్తం 25 మంది మహిళలు పాల్గొన్నారు. బంపర్ ప్రైజ్‌ను డ్రా ద్వారా తీసి సోఫాసెట్‌ను అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.5వేలు, రూ.3 వేలు, రూ.2వేలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పరిటాల శ్రీనివాసరావు, నాగరాజు, శ్రీరామమూర్తి, కాశయ్య, మొహనరావు, రాఘవరావు పాల్గొన్నారు.


ప్రథమ బహుమతిని అందజేస్తున్న నిర్వాహకులు

చరిత్ర అధ్యయనం.. భవిష్యత్ తరాలకు అవసరం

ఇంకొల్లు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : చరిత్ర అధ్యయనం భవిష్యత్తు తరాలకు అవసరమని నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు పేర్కొన్నారు. ఇంకొల్లుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మేడూరి సత్యనారాయణ రచించిన ఇంకొల్లు చరిత్ర గ్రంథాన్ని ఇంకొల్లులో ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆ గ్రంథాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా రావి నాగేశ్వరి అధ్యక్షతన జరిగిన సభలో రావెల సాంబశివరావు మాట్లాడుతూ వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగిన ఇంకొల్లు చరిత్రను గ్రంథ రూపంలో ప్రజలకు అందించిన రచయిత సత్యనారాయణ కృషి అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి కొల్లూరి నాయుడమ్మ, చుండి మురళి, లక్ష్మణబాబు, హరిబాబు, అబ్రహాంలింకన్, గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.